టోల్ ఫ్రీ నెంబర్ పోస్టర్లను ఏర్పాటు చేయండి

కలెక్టర్ డాక్టర్ సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్



మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అన్ని సచివాలయాల్లో 1972 టోల్ ఫ్రీ నెంబర్ పోస్టర్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ డాక్టర్ సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాళ్ల నార్కొటిక్స్ కో ఆర్డినేషన్ (ఎన్‌సీవోఆర్‌డీ) సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి, మాదకద్రవ్యాల రవాణా, వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో ఈగల్ క్లబ్స్ ఏర్పాటు చేయాలని డీఈవోను ఆదేశించారు. ఈ సమావేశంలో కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ శాంతకుమారి పాల్గొన్నారు.

వృద్ధుల కోసం ప్రత్యేక చట్టాలు

- కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్డి

6



మాట్లాడుతున్న కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్డి

చెంచులకు ఉచిత స్పర్శదర్శనం



7

నిరుపయోగం!

- శిథిలావస్థకు పోల్ సెంటర్
- పందిపాడులో కరెంట్ స్తంభాల తయారీ సెంటర్
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- టెండర్ ప్రక్రియ లేకుండా కాంట్రాక్టు దక్కించుకున్నట్లు ఆరోపణలు



పోల్స్ తయారీ చేసే ప్రాంతం



తుప్పుపట్టిన ఇనుపతీగ

కల్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా విద్యుత్‌శాఖ పరిధిలో ఆరు ప్రైవేటు, ఒక ప్రభుత్వ కరెంట్ స్తంభాల తయారీ కేంద్రాలు (పోల్ సెంటర్లు) ఉన్నాయి. కల్లూరు మండలం పందిపాడు గ్రామ పరిధిలో దాదాపు ఆరు ఎకరాల్లో 1985లో పీఎస్‌సీసీ పోల్ సెంటర్‌ను చీఫ్ ఇంజనీర్ ఎన్‌సీవీ. రామావతారం ప్రారంభించారు. ఆ తర్వాత విద్యుత్ శాఖ అధికారుల తీరు వల్ల ఆ ప్రాంతం అసాంఘిక కార్యకలాపాల అడ్డాగా మారింది. ఎక్కడ చూసినా మద్యం బాటిళ్లు, గాజుముక్కలు ఉన్నాయి. అధికారులు ఈ స్థితి మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు ప్రభుత్వ పోల్‌సెంటర్ ద్వారా నాణ్యమైన పోల్స్‌ను తక్కువ ఖర్చుతో తయారు చేసేలా చర్యలు తీసుకున్నారు. అధికారుల అలసత్వంతో రూ.కోట్ల విలువ చేసే విద్యుత్‌శాఖ ప్రాపర్టీ నిరుపయోగంగా తయారైంది. ప్రైవేటు పోల్ సెంటర్ల యాజమాన్యాలు అందించే అమ్యామ్యాలకు అలవాటు పడిన అధికారులు పందిపాడు పోల్‌సెంటర్‌ను గాలికొదిలేశారు. ప్రభుత్వం లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాలు, విలువైన యంత్ర సామాగ్రి, పోల్స్ అచ్చువేసే గ్రిల్స్, నీటి తొట్లు, స్తంభాల్లోకి వేసే ఇనుపతీగ పూర్తిగా తుప్పుపట్టి పోయాయి. పోల్స్ తయారీ ప్రక్రియ ఆగిపోవడం, దీంతో ప్రైవేట్ పోల్ సెంటర్ల నుండి అధిక ధరకు అధికారులు కోనుగోలు చేస్తుండటంతో విద్యుత్‌శాఖతో పాటు వినియోగదారులపై అధిక భారం పడుతుందనే ఆరోపణలున్నాయి.

● టెండర్ ప్రక్రియ లేకుండా కాంట్రాక్టు ఇచ్చినట్లు ఆరోపణలు

జిల్లాలో పోల్‌సెంటర్ల కాంట్రాక్టు పూర్తిగా ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ ఆధ్వర్యంలో జరుగుతాయి. గతంలో కార్పొరేట్ ఆఫీసు స్థాయిలో టెండర్ పిలువకుండానే ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించినట్లు ఆరోపణలున్నాయి. డిస్కం పరిధిలో చేపట్టే పనులకు టెండర్లు పిలవాలనే నిబంధనలను తుంగలో తొక్కి కాంట్రాక్టు ఇవ్వడంలో అంతర్యమేమిటనే విమర్శలున్నాయి. ఈఅంశంపై విద్యుత్‌శాఖ టెక్నికల్ ఈఈ మహేశ్వర్ రెడ్డి, సివిల్ ఏడీఈ శ్రీనివాసులును సంప్రదించగా ఈఏడాది 7 సెప్టెంబరు 2025న కాంట్రాక్టర్‌కు అవార్డ్ కాగా పది రోజుల్లో అగ్రిమెంట్ కావాల్సి ఉంది. అయితే సదరు కాంట్రాక్టర్ 2025 నవంబర్ 19న అగ్రిమెంట్ అయినట్లు డాక్యుమెంట్ ఇచ్చారని సివిల్ ఏడీఈ స్పష్టం చేశారు. నిబంధనలు ఒక్కొక్కరికీ ఒక్కోలా ఉంటాయా అని ఇతర కాంట్రాక్టర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అప్పటికైనా అధికారులు నిబంధనల మేరకు టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లుకు అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లాలో ఈనెల 21 పోల్ సెంటర్ల టెండర్లు ప్రక్రియ జరుగుతున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.



అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన పోల్‌సెంటర్



నిరుపయోగంగా పోల్స్ తయారీ పరికరాలు

మావోయిస్టుల హత్య దారుణం

- సీఐఐ సదస్సు ప్రచార ఆర్భాటమే
- కాగితాల ఎంవోయూలు నిరుపయోగం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : ఆరుగురు మావోయిస్టులను ఎన్‌కౌంటర్ పేరుతో హత్య చేయడం దారుణమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పేర్కొన్నారు. బుధవారం ఆదోని ఆవకాయ ఫంక్షన్ హాల్‌లో మావోయిస్టుల హత్యపై ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది దేశం నిర్ఘాంతపోయే ఎన్‌కౌంటర్ అన్నారు. విజయవాడ, గుంటూరు, ఏలూరు, కాకినాడ, విజయవాడ ప్రాంతాల్లో టార్గెట్ చేసి మావోయిస్టులను పట్టుకొని కాల్చి చంపారన్నారు. అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అన్నారు. వామపక్షాలు, మేధావులు విద్యావేత్తలు మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కోరుతున్నా మోదీ ప్రభుత్వం అంగీకరించలేదన్నారు. విశాఖపట్నంలో జరిగిన సీఐఐ సమ్మిట్ ప్రచార ఆర్భాటమేనని, ఇది రాష్ట్ర ప్రజలను దగా చేసిందని ఆరోపించారు. సీఐఐ మీద పెట్టుబడుల మీద నమ్మకం కలగడం లేదని, కాగితాల ఎంవోయూలు కాకుండా సంపద సృష్టించే ఎంవోయూలు కావాలని ఆయన కోరారు. రాష్ట్ర విభజన హామీలను, ప్రత్యేక హోదా సాధన, కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణం అన్ని విషయాల్లో ప్రభుత్వాలు ప్రజలను దగా చేశాయని దుయ్యబట్టారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రామచంద్రయ్య, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కేవీపీ ప్రసాద్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, రైతు సంఘం నాయకులు జగన్నాథం, సుదర్శన్, వీరేష్ కల్లుబావి రాజు పాల్గొన్నారు.

డీడీఓ భవనాలకు హంగులు

- మరమ్మతులకు రూ.95.70 లక్షలు
- ఒకే భవనంలో మూడు కార్యాలయాలు
- జిల్లా పరిషత్ నుంచి నిధులు విడుదల

కర్నూలు న్యూసిటీ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆరు డివిజన్ కేంద్రాల్లోని కార్యాలయాల మరమ్మతులకు రూ.95.70 లక్షలు కేటాయించారు. డివిజనల్ డెవలప్‌మెంట్ కార్యాలయాలను అన్ని హంగులతో త్వరలో ప్రారంభించనున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత డీడీఓ కార్యాలయాలకు మరిన్ని అధికారులను కట్టబెట్టింది. కర్నూలు, ఆదోని, పత్తికొండ, నంద్యాల, డోన్, ఆత్మకూరు డివిజన్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన డీడీఓ కార్యాలయాల్లోనే పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధికి డివిజనల్ పంచాయతీ అధికారి, డ్వామా ఏపీడీ కార్యాలయాలను కూడా ఈ భవనంలోనే ఏర్పాటు చేస్తున్నారు.

మిగతా 7లో...

రైతుల ఆనందోత్సవం..!

- ఖాతాల్లో 'అన్నదాత సుఖీభవ' జమ
- 2.72 లక్షల మంది రైతులకు రూ.181.36 కోట్లు



కర్నూలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతుల ఖాతాల్లో 'అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్' సాయం ఏడు వేల రూపాయలు బుధవారం జమ చేసింది. సెల్‌ఫోన్లకు వచ్చిన సంక్షిప్త సమాచారం చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో ప్రకృతి సహకరించకపోవడంతో పంటలన్నీ నాశనం అయ్యాయి. దీంతో రైతులు ఆర్థికంగా చితికిపోయారు. ఈ సమయంలో అండగా మేమున్నాం అంటూ సీఎం చంద్రబాబు సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం కింద ఆర్థిక భరోసా ఇవ్వడం రైతులకు ఊరటనిచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద రూ.5 వేలు, కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ పథకం కింద రూ.2 వేలు కలిపి రూ.7 వేలు చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేశారు. జిల్లాలో 2,72,757 మంది రైతులకు రూ.181.36 కోట్లు ఆర్థిక ప్రయోజనం చేకూరింది. అన్నదాతలను కదిపితే ఆనందంతో పులకరించిపోతున్నారు. 'అధిక వర్షాలు, ధరలు పతనమై తీవ్రంగా నష్టపోయాం.. అప్పులు తీర్చేందుకు వలసలు వెళ్తున్నాం.. ఇలాంటి పరిస్థితుల్లో చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం ఏడు వేలు జమ చేయడం ఎంతో సంతోషంగా ఉంది. రబీ సాగు పెట్టుబడికి ఎంతో ఊరట లభించింది.' అని కోసిగి మండలం డి.బెళగల్ గ్రామానికి చెందిన రైతు ఉరుకుందు ఆనందం వ్యక్తం చేశారు. బుధవారం కర్నూలు రూరల్ మండలం ఆర్.కొంతలపాడు గ్రామంలో ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కలెక్టర్ డాక్టర్ ఏ.సిరిలు ప్రారంభించారు. కోడుమూరు నియోజకవర్గంలోని 35,052 మంది రైతులకు రూ.23.06 కోట్లు మెగా చెక్కును రైతులకు అందజేశారు.

● కష్టకాలంలో భరోసా

జిల్లాలో అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ సాయం మెగా చెక్కులను ఎమ్మెల్యేలు, అధికారులు రైతులకు అందజేశారు. ఎమ్మిగనూరు మండలం దైవందిన్నె గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని 38,318 మంది రైతులకు రూ.26.04 కోట్ల చెక్కును ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ మల్లయ్య, వైస్ చైర్మన్ బి.అంజి, ఏడీఏ మహ్మద్‌ఖాద్రీలు అందజేశారు. పత్తికొండ నియోజకవర్గంలో 54,774 మంది రైతులకు రూ.37.17 కోట్లు తుగ్గలి మండలం ఎర్రగుడిలో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు పంపిణీ చేశారు. శాలివాహన కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర పాల్గొన్నారు. పాణ్యం నియోజకవర్గంలో 20,287 మంది రైతులకు రూ.13.36 కోట్లు మెగా చెక్కును ఓర్వకల్లులో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గౌరు చరిత అందజేశారు. టీటీడీ బోర్డు డైరెక్టర్ మల్లెల రాజశేఖర్ పాల్గొన్నారు. ఆదోని నియోజకవర్గంలో 18,722 మంది రైతులకు రూ.12.32 కోట్ల మెగా చెక్కును పెద్దతుంబళం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ అజయ్‌కుమార్, ఏపీ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, ఏపీ కురబ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, టీడీపీ నాయకుడు కె.ఉమాపతినాయుడు తదితరులు అందజేశారు. ఆలూరు నియోజకవర్గానికి చెందిన 63,317 మంది రైతులకు రూ.42.08 కోట్ల మెగా చెక్కును ఆలూరులో టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి, వ్యవసాయ శాఖ ఏడీ చెంగల్‌రాయుడు, ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ బిల్లేకల్లు వెంకటేశ్ అందజేశారు. మంత్రాలయం నియోజకవర్గంలో 41,992 మంది రైతులకు రూ.27.61 కోట్లు మండల కేంద్రం కౌతాళంలో జరిగిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. కర్నూలు నియోజకవర్గంలో 295 మంది రైతులకు రూ.18 లక్షల చెక్కును జొహరాపురంలో జరిగిన కార్యక్రమంలో అధికారులు అందజేశారు. అత్యధికంగా ఆలూరు నియోజకవర్గం రైతులు రూ.42.08 కోట్లు ఆర్థిక ప్రయోజనం పొందడం విశేషం.

● నియోజకవర్గాల వారిగా రైతులు అందుకున్న అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ సాయం (రూ.కోట్లల్లో):

నియోజకవర్గం	రైతులు	అన్నదాత సుఖీభవ	పీఎం కిసాన్	మొత్తం
కర్నూలు	295	0.15	0.03	0.18
కోడుమూరు	35,052	17.52	5.48	23.00
ఎమ్మిగనూరు	38,318	19.16	6.88	26.04
ఆదోని	18,722	9.36	2.96	12.32
మంత్రాలయం	41,992	20.99	6.62	27.61
పత్తికొండ	54,774	27.38	9.79	37.17
ఆలూరు	63,317	31.65	10.43	42.08
పాణ్యం	20,287	10.14	3.22	13.36
మొత్తం	2,72,757	138.38	45.12	181.36

రైతులకు అండగా ప్రభుత్వం : కలెక్టర్



ఆర్.కొంతలపాడులో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సిరి

కర్నూలు రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి పేర్కొన్నారు. కర్నూలు మండలం ఆర్.కొంతలపాడు గ్రామంలో బుధవారం జరిగిన అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ రెండో విడత కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు నష్టపోకుండా ఆదుకుంటామన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఎన్నికల ముందు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలన్నీ దశల వారిగా కూటమి ప్రభుత్వం నెరవేర్చుతుందన్నారు. తమది రైతు సంక్షేమ ప్రభుత్వమని అన్నారు. అనంతరం రైతులకు మెగా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, ఉద్యానశాఖ అధికారి రాజాకృష్ణారెడ్డి, ఎల్‌డీఎం రామచంద్రరావు, ఏడీ సాలురెడ్డి, తహసీల్దార్ రమేష్‌బాబు, సర్పంచు మహానంది, తాండ్రపాడు సర్పంచు జయన్న, టీడీపీ మండల కన్వీనర్ బుర్ర వెంకటేష్‌నాయుడు, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు రామాంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

రూ.14.6 కోట్లతో విశ్రామ్ సదన్

- కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్



కర్నూలు హస్పిటల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పవర్ గ్రిడ్ కార్పొరేషన్ సహకారంతో స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ సమీపంలో రూ.14.6 కోట్లతో రోగుల సహాయకులకు విశ్రామ్ సదన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం డిప్యూటీ సూపరింటెండెంట్లు నాగేశ్వరరావు, లక్ష్మీబాయితో సమీక్ష నిర్వహించారు. రెండు రోజుల్లో భూ పరీక్షకు బృందం రానున్నట్లు తెలిపారు. కర్నూలు ప్రాంతీయ కంటి ఆసుపత్రి వద్ద ఆటోల పార్కింగ్‌ను ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో హెడ్ నర్సుల పనితీరు అధ్వానంగా ఉందని, వారి సేవలు మరింతగా మెరుగుపడేలా డిప్యూటీ సూపరింటెండెంట్లు తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. రోగుల సహాయకుల కోసం కలెక్టరేట్ పక్కన ఉన్న శాలమ్మ సత్రంలో 26 గదులు ఉన్నాయని, వీటిని రోగుల సహాయకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్ఎంవో వెంకటరమణ పాల్గొన్నారు.

కష్టనష్టాలు...

- కేంద్ర బృందం ముందు కన్నీళ్లు పెట్టుకున్న రైతులు
- కేంద్రం సహకరించాలి : కర్నూలు మార్కెట్ యార్డు సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ జయలక్ష్మి



ఉల్లి రైతులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం ప్రతినిధులు

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏడాదంతా మాకు కష్టాలూ.. నష్టాలే.. ప్రభుత్వం నుంచి మాకు సహాయ సహకారాలు అందితేనే వాటి నుంచి బయట పడుతాం.. లేకపోతే ఇలా పస్తులతోనే ఉండాల్సి వస్తుందని ఉల్లి రైతులు కేంద్ర బృందానికి కన్నీళ్లతో తమ బాధలు చెప్పుకున్నారు. బుధవారం ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర బృందంలోని ఉన్నతాధికారులు ఉల్లి రైతుల సమస్యలు తెలుసుకోవడానికి కర్నూలు మార్కెట్ యార్డులో ఉదయం 9:30 నుంచి 11:30 గంటల వరకు గడిపారు. మార్కెట్ యార్డులోకి ప్రవేశించగానే ముందుగా గంట సేపు కర్నూలు మార్కెట్ కమిటీ యార్డు సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ జయలక్ష్మితో పాటు ఉద్యాన శాఖ జిల్లా అధికారి కృష్ణారెడ్డి, మార్కెటింగ్‌శాఖ ఏడీఎం నారాయణ మూర్తి తదితర జిల్లా అధికారులతో దాదాపు గంట సేపు ఉల్లి రైతుల సమస్యలపై చర్చించారు. కేంద్ర బృందం అధికారులతో సెక్రటరీ జయలక్ష్మి జిల్లాలో ఉల్లి రైతుల స్థితిగతులను వివరించారు. రాష్ట్రంలో ఉల్లి సాగులో ఉమ్మడి జిల్లా మొదటి స్థానంలో ఉందని, అందులో భాగంగా కర్నూలు మార్కెట్ కమిటీ యార్డులోనే ఉల్లి క్రయవిక్రయాలు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ఏడాదిలో ఖరీఫ్, రబీ సీజన్లలో ఉల్లి పంటను రైతులు సాగు చేస్తున్నారని, ఈ సంవత్సరం అధిక వర్షాలతో పాటు బంగ్లాదేశ్, మలేషియా, దేశంలోని ఉత్తరాది రాష్ట్రాలకు కర్నూలు నుంచి ఎగుమతి చేసే అవకాశాలు తప్పిపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిందన్నారు. సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో రైతులు పెద్ద ఎత్తున ఉల్లిని కర్నూలు యార్డుకు విక్రయానికి తెచ్చారని, ప్రతి రోజూ 10వేల నుంచి 20వేల క్వింటాళ్ల దాకా కర్నూలు మార్కెట్ యార్డు కిటకిటలాడిందని వివరించారు. మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటానికి రూ.1,200 రైతులకు చెల్లించేలా నిర్ణయం తీసుకోవడంతో పాటు ఒక హెక్టారుకు ఉల్లి పంటను సాగు చేసిన రైతులకు రూ.50వేల పరిహారం ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ సందర్భంగా కేంద్రం ఉద్యాన శాఖ డిప్యూటీ కమిషనర్ బీజే బ్రహ్మ, వ్యాపారులు, ఉద్యాన శాఖ అధికారులు, మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులతో చర్చించారు. జిల్లా ఉల్లి రైతులను ఆదుకునేందుకు కేంద్రం తీసుకోవాల్సిన చర్యలపై సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి కేంద్ర బృందం అధికారులకు నివేదికను అందజేశారు. కేంద్ర బృందంలో బీజే బ్రహ్మతో పాటు మనోజ్, రాజీవ్ కుహార్, హేమంగ భార్గవ్, శరవణన్, రాష్ట్ర ఉన్నతాధికారి జమదగ్ని, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రాజా కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



తెల్లవారుజామున పొగమంచులో ప్రధాన ఆలయం

శ్రీశైలంలో చలి పంజా

శ్రీశైలం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నల్లమలలోని శ్రీశైల క్షేత్రం పరిసర ప్రాంతాల్లో చలి పంజా విసురుతోంది. రోజురోజుకూ చలి తీవ్రత పెరిగిపోతోంది. పదిరోజులుగా పది డిగ్రీల అత్యల్ప స్థాయికి ఉష్ణోగ్రతలు పడిపోయాయి. తెల్లవారుజామున పొగమంచుతో క్షేత్ర వీధులు కనిపించడం లేదు. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. శీతాకాలం ప్రారంభమైన నవంబరు తొలి వారం నుంచే చలి తీవ్రతతో పిల్లలు, వృద్ధులు వణికిపోతున్నారు. చలిగాలుల వల్ల వచ్చే వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.



శ్రీశైలం ఘాట్‌లో పొగ మంచు



బాల్యానికి భరోసా

- హక్కులతో ఆకాంక్షను నెరవేర్చుకునే మార్గం
- సక్రమంగా అమలుకు నోచుకోని బాలల హక్కులు
- నేడు ప్రపంచ బాలల హక్కుల పరిరక్షణ దినోత్సవం



ఆత్మకూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మంచీ, చెడులను పూర్తిగా అర్థం చేసుకోలేని బాలలకు హక్కు లేంటి అనుకుంటున్నారా..? పిల్లల స్వేచ్ఛను దోచుకునే పెద్దలున్న చోట వారి కోసం హక్కులుండటం తప్పని సరి. మన సమాజంలోని బలహీనుల్లో, దోపిడీకి గురయ్యేవారిలో పిల్లలు కూడా ఉన్నారు. బాల్యానికి రక్షణ కల్పించాలంటే పిల్లలకు తప్పక కొన్ని హక్కులు ఉండాలి. బాల్యాన్ని కాపాడాలనే సంకల్పంతో ఐక్యరాజ్యసమితి పిల్లల హక్కుల కోసం ఒక ఒప్పందాన్ని ఆమోదించింది. చైల్డ్ రైట్స్ కన్వెన్షన్ (సీఆర్‌సీ)గా పేర్కొనే ఈ ఒప్పందం గురించి, అందులో పేర్కొన్న హక్కుల గురించి ప్రత్యేకంగా ప్రచారం చేయడానికి ప్రతి ఏటా నవంబరు 20న ప్రపంచ బాలల హక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని జరుపుతున్నారు. వివిధ దేశాల్లో బాలల రక్షణకై ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఏటా ఓ నినాదంతో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ ఏడాది 'నా రోజు.. నా హక్కులు' అనే నినాదాన్ని ఎంపిక చేశారు.

బాలల హక్కులు ఇవే

భారత రాజ్యాంగం 18ఏళ్లలోపు బాలలందరికీ పలు హక్కులను కల్పించింది. సమానత్వం, కులం, మతం, జాతి, భాష, ఆడ, మగ, పుట్టుక ప్రదేశం వంటి ఏ విధమైన వివక్షను ఎవరి పట్లా చూపరాదు. బిడ్డ పుట్టగానే పేరు, జాతీయత కలిగి ఉండటం, తల్లిదండ్రులతో కలిసి జీవించడం బాలల హక్కు. బాలలను అక్రమంగా రవాణా చేయడం, వ్యభిచార వృత్తిలో దించడం, జీతాలకు పెట్టడం నేరం. అలాగే బాలలు వారి అభిప్రాయాలను పాటలు, బొమ్మలు, ఆటలు, రచనల ద్వారా వ్యక్తం చేయవచ్చు. బాలలు తమకు నచ్చిన మతాన్ని కలిగి వుండవచ్చు. ప్రభుత్వాలు బాలల రక్షణకై శిశు సంరక్షణాలయాలు నిర్వహించాలి. తల్లిదండ్రులు ఇద్దరూ పనుల్లోకి వెళ్లినట్లయితే ఆ బాలల బాధ్యత ప్రభుత్వాలు తీసుకోవాలి. పిల్లలను ఎవరైనా హింసించినా, దౌర్జన్యం చేసినా, వేధించినా నేరమే. శరణార్థులుగా మారిన బాలలకు మానవత్వంతో సాయం చేయాల్సిన బాధ్యత సమాజంపై ఎంతైనా ఉంది. మానసికంగా, శారీరకంగా వికలాంగులైన వారి వృద్ధికి వారిలో ఆత్మవిశ్వాసం పెంపుదలకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. ఉచిత నిర్బంధ విద్యను పొందడం బాలల హక్కు. ప్రమాదకరమైన పనులు, గనుల్లో, పేలుడు పదార్థాల తయారీలో, హోటళ్లలో బాలల్ని పనిలో వుంచుకోరాదు. మాదకద్రవ్యాల నుంచి బాలలను దూరం చేయాలి. బాలల్ని నిర్బంధించరాదు. లైంగిక దూషణ చేయరాదు. 18ఏళ్లలోపు వయస్సు బాలల్ని విడుదల చేయడానికి వీలులేని నేరాలకు ఉరిశిక్ష గాని, యావజ్జీవశిక్ష గాని విధించరాదు.

బాల కార్మికుల్లో ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రథమ స్థానం

బాల కార్మికుల్లో రాష్ట్రంలోనే ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రథమ స్థానంలో ఉన్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం రోజుకు 6గంటలు పనిచేసే 6నుంచి 14ఏళ్ల మధ్య ఉన్న బాల కార్మికులు సుమారు 70వేల మంది వరకు ఉన్నట్లు తెలిసింది. మరో 30వేల మందికి పైగా బడి బయట ఉన్నట్లు గుర్తించారు. ప్రత్యేకించి ఎమ్మిగనూరు బాల కార్మికులు ఎక్కువ ఉన్న మండలంగా గుర్తింపు ఉంటే ఆ తర్వాతి స్థానాలను నందవరం, హొళగుంద, కోసిగి, గోనెగండ్ల, దేవనకొండ, పెద్దకడబూరు మండలాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

పిల్లల్ని బడికి పంపించాలి



బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించి పిల్లల్ని బడికి పంపించేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలి. అలాంటప్పుడే బాలల హక్కులను కాపాడవచ్చు. తల్లిదండ్రులు విద్య ప్రాముఖ్యతను గుర్తించి పిల్లల్ని పాఠశాలలకు పంపాలి. ప్రభుత్వం కూడా పాఠశాల విద్యకు అధిక ప్రాధాన్యమిస్తోంది. వీటిని సద్వినియోగం చేసుకోవాలి. కొట్టాలచెరువు గ్రామంలో గతంలో డ్రాపౌట్స్ అధికంగా ఉండేవి. కానీ పిల్లల తల్లిదండ్రులకు విద్య పట్ల అవగాహన కల్పించి గ్రామంలోని విద్యార్థులు పాఠశాలకు వచ్చేలా ప్రయత్నం చేసి వందశాతం జీఈఆర్‌ను సాధించాం.

- వెంకటేష్, ఉపాధ్యాయుడు, కొట్టాలచెరువు గ్రామం

వృద్ధుల కోసం ప్రత్యేక చట్టాలు

- కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ధి



హాజరైన వృద్ధులు, తదితరులు

నందికొట్కూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పిల్లల నుంచి నిరాదరణకు గురవుతున్న వృద్ధ తల్లిదండ్రులు వారి నుంచి భరణం పొందే చట్టాలు ఉన్నాయని కర్నూలు జిల్లాన్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ధి అన్నారు. బుధవారం నందికొట్కూరులోని శ్రీకాళీ ప్రసాద ఆశ్రిత ఆశ్రమంలో నల్సా న్యూమ్యాడ్యుల్ అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథులుగా జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ధి, కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి శాశ్వత లోక్ అదాలత్ ఛైర్మన్ వెంకట హరినాథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కబర్ధి మాట్లాడుతూ తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం 2007 ప్రకారం పిల్లల నుంచి నిరాదరణకు గురైన తల్లిదండ్రులు చట్ట ప్రకారం వారి నుంచి భరణం పొందే హక్కు ఉందన్నారు. ఉచిత న్యాయ సహాయం, విద్యా హక్కు కోసం 1098 హెల్ప్ లైన్, మహిళా హెల్ప్‌లైన్ నెంబర్ 181, న్యాయ సహాయం కోసం హెల్ప్‌లైన్-15100, చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ నెంబరు 1098, దివ్యాంగజన్ హెల్ప్ లైన్ నెంబరు 14456 తదితర అంశాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు పల్లె ప్రియాంక సేవా సమితి అధ్యక్షుడు, రిటైర్డ్ జిల్లా న్యాయాధికారి మోహన్‌రావు, సీనియర్ సివిల్ న్యాయాధికారి శోభారాణి, జూనియర్ సివిల్ న్యాయాధికారి దివ్య, ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి, మున్సిపల్ కమిషనర్ బేబి, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, సీఐ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్లు, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

30న నంద్యాలలో ఓపెన్ చెస్ టోర్నమెంట్

నంద్యాల హాస్పిటల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా చెస్ సంఘం నిర్వహణలో ఈ నెల 30న రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో బంకించంద్ర ఛటర్జీ ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నంద్యాల చెస్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రవికృష్ణ, రామసుబ్బారెడ్డి తెలిపారు. వందేమాతరం గీతం 150సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నంద్యాల, కర్నూలు, కడప, అనంతపురం, ప్రకాశం జిల్లాల స్థాయిలో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఫిడే నిబంధనలకు అనుగుణంగా స్విస్ రౌండ్ పద్ధతిలో పోటీలు జరుగుతాయన్నారు. విజేతలకు నగదు బహుమతులతోపాటు ట్రోఫీలు, పతకాలు అందజేస్తామన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈ నెల 27వ తేదీలోపు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీచెస్.ఓఆర్‌జీ అనే వెబ్‌సైట్‌లో ఎంట్రీలను నమోదు చేసుకోవాలన్నారు. పవన్‌కల్యాణ్‌రెడ్డి టోర్నమెంట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తారన్నారు. వివరాలకు 90104 51585 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అహోబిలంలో ఏపీ డీసీఎంఎస్ చైర్మన్



మాట్లాడుతున్న హరిబాబు నాయుడు

ఆళ్లగడ్డ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం లక్ష్మీ నరసింహ స్వామి వారిని ఏపీ డీసీఎంఎస్ చైర్మన్ వజ్రాణం హరిబాబు నాయుడు బుధవారం దర్శించుకొన్నారు. ఆయనకు ఆలయ అర్చకులు ఘనంగా స్వాగతం పలికి లక్ష్మీ నరసింహస్వామి అమ్మవార్లుకు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వామి వారి జన్మనక్షత్రం కావడంతో లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. ఆయన వెంట టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు సంజీవరాయుడు ఉన్నారు.

వైభవం.. ఆది దంపతుల కల్యాణం

- మహానందిలో ముగిసిన కార్తీక మాస ఉత్సవాలు



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

మహానంది, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో ఆది దంపతుల కల్యాణోత్సవం వైభవంగా సాగింది. కార్తీక మాసం అమావాస్య పురస్కరించుకుని బుధవారం తెల్లవారుజాము నుంచి కామేశ్వరీ దేవికి ప్రత్యేక పూజలు జరిగాయి. కామేశ్వరీదేవి అమ్మవారికి ఘనంగా లక్ష కుంకుమార్చన నిర్వహించారు. యాగశాల మండపంలో పూర్ణాహుతి చేశారు. రాత్రి 7 గంటల నుంచి ఆలయం ప్రాంగణంలోని అభిషేకమండపంలో మహానందీశ్వరుడు, కామేశ్వరీదేవి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. దీంతో మహానందిలో కార్తీక మాసోత్సవాలు ముగిశాయి.



మహానందిలో లక్ష కుంకుమార్చన పూజలను నిర్వహిస్తున్న ఋత్వికులు

పింఛన్ల కోసం ఎదురుచూపులు

- కొత్త ఫింఛన్ల మంజూరు అయ్యేనా?
- నాయకులు హామీలు నీటి మూటలు
- 17నెలలైనా తెరుచుకోని సైటు
- ఆందోళనల్లో వృద్ధులు, కళాకారులు, కార్మికులు

ప్రభుత్వాలు ఇచ్చే కాస్తో.. కూస్తో పింఛను డబ్బులే వారికి జీవనాధారం.. అలాంటి పింఛన్లు కూడా రాకపోవడంతో వారి జీవనం దుర్భరమైంది. కన్న బిడ్డలు పట్టించుకోక.. అయిన వారి ఆదరణ లేక.. వయస్సు మీద పడి పనిచేసే సత్తువ లేక.. ఏదో సర్కారు ఇచ్చే పింఛన్ డబ్బులతో జీవనం సాగిద్దామనుకున్న వృద్ధులు, కళాకారులు, కార్మికులకు నిరాశే ఎదురైంది. కొత్త ప్రభుత్వంలో తమకు కాస్త ఆసరా ఉంటుంది అనుకుంటే అది కూడా లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 17 నెలలు దాటినా నేటికీ కొత్త పింఛన్లు రాకపోవడంతో వారంతా ఎదురుచూపులు చూస్తున్నారు. చేతిలో డబ్బుల్లేక.. మందులు కొనే స్థోమత లేక.. రోజురోజుకూ ఆరోగ్యం క్షీణిస్తుండగా ప్రభుత్వ ప్రకటన కోసం పడిగాపులు కాస్తున్నారు. కొత్త పింఛన్లు ఇచ్చి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.



డీఆర్‌డీఏ కార్యాలయం నంద్యాల

నంద్యాల టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కొత్త పింఛన్లు ఎప్పుడు ఇస్తారోనని వృద్ధులు, కళాకారులు, కార్మికులు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటై దాదాపు 17 నెలలైనా వారి ఆశలు అడియాశలయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కొత్త ఫించన్లు మంజూరు చేస్తామని చెప్పారు. ఇప్పటికి చాలా మంది ఎదురు చూపులు చూస్తు ఉండిపోయారు. 60 ఏళ్లు నిండిన అర్హత ఉన్న వద్దులు, కల్లుగీత కార్మికులు, కళాకారులు తదితర వర్గాలకు చెందిన వేల మంది పింఛన్ల కోసం పడిగాపులు కాస్తున్నారు. 2024 ఎన్నికల్లో ప్రచారంలో పోటీల్లో ఉన్న ఆయా పార్టీల నాయకులు హామీలు ఇచ్చారు. అవి నేటికీ నెరవేరలేదు.

2023 నవంబరు నుంచి వెబ్‌సైట్‌ను..

2023 అక్టోబరు వరకు వచ్చిన పింఛన్ల దరఖాస్తు పరిశీలించి అర్హత ఉన్నవారికి అప్పటి వైసీపీ ప్రభుత్వం పింఛను మంజూరు చేసింది. 2023 నవంబరు నుంచి వెబ్‌సైట్‌ను పూర్తిగా మూసివేసింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. సుమారుగా 17 నెలలు అవుతున్న సైట్‌ను తిరిగి ప్రారంభించే చర్యలు తీసుకోవడం లేదని అర్హులు వాపోతున్నారు. పలు సమావేశాల్లో సభల్లో పింఛన్లు ఎప్పుడిస్తారంటూ ప్రశ్నిస్తున్నా సరిఅైన సమాధానం నాయకుల నుంచి రావడం లేదు.

డబ్బుల్లేక.. మందులు కొనలేక..

వృద్ధులు, నిరుపేద కళాకారులు, కల్లుగీత కార్మికులు అనారోగ్యానికి గురై కన్నబిడ్డల ఆదరణ నోచుకోని వారు డబ్బుల్లేక.. మందులు కొనలేక భారంగా బతుకు వెళ్లదీస్తున్నారు. పింఛను వస్తే ఆరోగ్యానికి మందులు కొనేవారమని, పోషణకు మందులకు కన్నబిడ్డల వద్ద చేయి చాచలేక రోజు గడిస్తే చాలనే భావనలో చాలా మంది ఉన్నా రు.

ఎన్నికలకు ముందు..

2026 సంవత్సరం ప్రారంభంలో పంచాయతీలు, మండల పరిషత్, జిల్లా పరిషత్, ప్రాదేశిక నియోజకవర్గాల్లో ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇటీవల ప్రకటన చేశారు. ఎన్నికల ప్రకటనకు ముందు అర్హులకు ప్రభుత్వం కనికరిస్తుందనే చిన్నఆశ ఇపుడిపుడే తలెత్తుతోంది. 2023 నవంబరు నుంచి 2025 సెప్టెంబరు వరకు సుమారుగా 20 నెలలుకు పైగా గడిచింది. కొత్త పింఛన్లు అర్హత ఉన్నవారి గోడు ఆలకించి సైట్ తెరవాలని ఆయా వర్గాల ప్రజలు కోరుతున్నారు.

ఉత్తర్వులు రాగానే దరఖాస్తు చేసుకోవచ్చు

చాలారోజుల నుంచి సైట్ ఓపెన్ చేయడం లేదు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే అర్హులందరూ పింఛను మంజూరుకు దరఖాస్తు చేసుకోవచ్చు. స్థానికంగా పరిశీలించి అర్హులైన వారికి ఎలాంటి తారతమ్యాలు లేకుండా పింఛన్లు మంజూరు చేస్తాం.

- శ్రీధర్‌రెడ్డి, పీడీ, డీఆర్‌డీఏ, నంద్యాల



కార్యక్రమంలో పాల్గొన్న వాల్మీకులు

వాల్మీకి భవన్ ఏర్పాటుకు కృషి

ఘనంగా కార్తీక వనభోజనం



మాట్లాడుతున్న బోయ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా కేంద్రంలో వాల్మీకి భవన్ ఏర్పాటుకు కృషి చేస్తానని వాల్మీకి/బోయ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ హామీ ఇచ్చారు. బుధవారం కర్నూలు శివారులోని ఎల్లమ్మ గుడి వద్ద ఉన్న శ్రీనివాస గార్డెన్స్‌లో వాల్మీకి కులస్థుల కార్తీక వన భోజనం ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కప్పట్రాళ్ల బొజ్జమ్మ మాట్లాడుతూ వాల్మీకి బోయలు అన్ని రంగాల్లో ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లాలో బీసీ సామాజిక వర్గంలోని అధిక జనాభా కలిగిన బోయలు స్థానిక సంస్థలలో పోటీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ డీఎస్పీ బోయగడ్డ వెంకటరామయ్య, మాజీ ఎంపీపీ రామచంద్ర నాయుడు, వాల్మీకి వనభోజన కమిటి సభ్యులు తలారీ కృష్ణ నాయుడు, మద్దిలేటి, సత్రం రామకృష్ణుడు, శ్రీనివాసులు, రామనాయుడు, శేఖర్, విష్ణు, బేతంకృష్ణుడు, సంజన తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో నమోదు చేయాలి

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో వసూలు చేసిన పన్నులను స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో నమోదు చేయాలని పీఆర్ కమిషనర్ ఆదేశించారు. బుధవారం డీపీవో కార్యాలయంలో పంచాయతీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వామిత్వ సంబంధించి గ్రామ సభలను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డీపీవో భాస్కర్, డీఎల్‌పీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు హాజరయ్యారు.

సత్యసాయి మందిరంలో త్రిశక్తి పూజలు





కర్నూలు కల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): భగవాన్ పుట్టపర్తి సత్యసాయిబాబా శత వర్ష జన్మదిన మహోత్సవాలు నగరంలో నెహ్రూనగర్‌లోగల శ్రీ సత్యసాయి మందిరంలో వైభవంగా కొనసాగుతున్నాయి. ఈనెల 23 వరకు 9 రోజుల పాటు కొనసాగుతున్న ఈ ఉత్సవాల్లో ఐదో రోజున మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మందిరంలో సాయంత్రం మహిళలతో సామూహికంగా 'త్రిశక్తి పూజ' భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ పూజలకు వందలాదిగా మహిళా భక్తులు హాజరయ్యారు. మహిళా శక్తిని చాటిచెప్పేలా మహాకాళి రూపంలో, సంపదల స్వరూపంగా మహాలక్ష్మి దేవి రూపంలో, సకల విద్యల స్వరూపంగా మహా సరస్వతి రూపంలో అమ్మవార్ల విగ్రహాలను నెలకొల్పి విభిన్న రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే సత్యసాయి మాతృమూర్తి ఈశ్వరమ్మ చిత్రపటానికి పూలదండలు వేసి నైవేద్యాలు సమర్పించారు. ఆధ్యాత్మిక ప్రవచన బోధకురాలు తెల్లాకుల జ్ఞానేశ్వరి ఆధ్వర్యంలో త్రిశక్తి పూజ ప్రారంభించారు. ఓంకార నాదంతో మొదలైన ఈ పూజల్లో త్రిశక్తి పూజ విశేషాలను ఆమె తెలియజేశారు. అంతకు ముందు మహిళా భక్తులతో వేద పఠనం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో చేపట్టారు. చివరగా మహిళా భక్తులకు వడిబియ్యం, మంగళ హారతి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి జిల్లా కన్వీనర్ మాకా అశోక్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఇతర ప్రతినిధులు సందీప్, సూర్యనారాయణ, మహిళా ప్రతినిధులు గీత, డాక్టర్ పార్వతి, సరోజ తదితరులు భక్తులకు ఏర్పాట్లు చేశారు.

మంచి పుస్తకం మన నేస్తం

- గ్రంథాలయాలు జ్ఞాన సముపార్జన కేంద్రాలు
- కొనసాగుతున్న పుస్తకాల పండుగ ..
- ఉమ్మడి జిల్లాలో ప్రతి రోజూ 3వేల మంది పాఠకుల సందర్శన

కొలిమిగుండ్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పుస్తక పఠనంతో మనుషుల సాంస్కృతిక స్థాయి పెరుగుతుంది. ఈ ప్రపంచంలో భాగమవుతారు. ప్రతి ఇంట్లో పిల్లలు, పెద్దలు చదవగల పుస్తకాలు ఉండాలి. ప్రతి ఊళ్లో సమాజంలోని అన్ని వర్గాల ప్రజల అవసరాలు తీర్చగల పుస్తక కేంద్రాలు ఉండాలి. మంచి పుస్తకాలు చదివే వారి చుట్టూ అనేక మంది మంచి మిత్రులు ఉన్నట్లే. అందుకే గ్రంథాలయాలు జ్ఞాన సముపార్జన నిలయాలు కావాలి. మన ముందు తరాల జీవన విధానం, నాగరికత, సంస్కృతి, సాంప్రదాయాలు పుస్తకాల రూపంలో తర్వాత తరాలకు అందుతాయి. అలాంటి వేలాది గ్రంథాలయాలు ఊరూరా ఉండాలి. ప్రపంచంలోని ఆలోచనాపరులందరూ పుస్తక పఠనం ద్వారానే తమ మేధస్సును పెంచుకొని అద్భుతాలు సృష్టించారు. ఒకప్పుడు ప్రజలకు ఎటువంటి సమాచారం కావాలన్నా గ్రంథాలయాలకు వెళ్లేవారు. పుస్తకాల అవసరం తెలిసిన ఆనాటి మేధావులు, సంఘ సంస్కర్తలు గ్రంథాలయ ఉద్యమాలను నడిపారు. ఇందులో భాగమే నవంబరు14 నుంచి 20 వరకు ప్రభుత్వం గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నది.

ఎన్టీఆర్ హయాంలో మండలాల్లో ప్రారంభమైన గ్రంథాలయ వ్యవస్థ

సమాజానికి విజ్ఞానాన్ని అందించాలన్న మహోన్నత ఆశయంతో 39 ఏళ్ల క్రితం అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు మండల కేంద్రాల్లో గ్రంథాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకవచ్చారు. ఆ సమయంలోనే ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో 57 గ్రంథాలయాలు ఏర్పాటయ్యాయి. వాటికి ఒక కార్యాలయం, గ్రంథాలయాధికారిని ఏర్పాటు చేశారు. ఇందులో దిన పత్రికలు, దేశ చరిత్ర, సంస్కృతి, సాంప్రదాయాలు, గ్రూప్స్‌తో పాటు ఇతర పోటీ పరీక్షల మేటీరియల్, విద్యార్థుల సిలబస్‌కు సంబంధించిన పుస్తకాలు, నవలలు, పురాణాలు, ఇతిహాసాలు, చిన్న పిల్లల కథల పుస్తకాలు, మాస పత్రికలు, వార పత్రికలు.. ఇలా ఒక్కటేమిటి మనిషి విజ్ఞానాన్ని పెంచే అన్నిరకాల పుస్తకాలు అందుబాటులోకి తెచ్చారు. గ్రంథాలయాల సహకారంతో ఎంతో మంది పేద విద్యార్థులు, నిరుద్యోగులు తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకున్న ఘటనలు ఉన్నాయి.

● విద్యార్థులు, పాఠకుల దరి చేర్చడానికే వారోత్సవాలు

గ్రంథాలయాల ప్రాముఖ్యతను, పుస్తక పఠనం వల్ల కలిగే లాభాలను తెలియజేయడానికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 1968 నుంచి ప్రతి ఏటా గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నాయి. నవంబరు 14 నుంచి, 20 వరకు ఈ వారోత్సవాలను నిర్వహిస్తూ పాఠకులకు గ్రంథాలయాలపై ఆసక్తి పెంచడానికి కృషి చేస్తున్నాయి. పుస్తక పఠనంపై ఆసక్తి పెరిగేలా విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ, చిత్ర లేఖన పోటీలు అధికారులు నిర్వహిస్తున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 21న బహుమతి ప్రదానం చేస్తున్నారు.

● గ్రంథాలయాలకు తరగని ఆదరణ

ఇంటర్నెట్ వ్యవస్థ పెద్ద ఎత్తున అందుబాటులోకి వచ్చి అర చేతిలో ప్రపంచం కనిపిస్తున్నా గ్రంథాలయాలకు ఆదరణ తగ్గలేదని చెప్పవచ్చు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నేటికీ 3వేల మందికి పైగా పాఠకులు గ్రంథాలయాలు సందర్శించడాన్ని బట్టి చూస్తే గ్రంథాలయాల ఆదరణ అర్థమవుతుందని పలువురు పేర్కొంటున్నారు. విజ్ఞానాన్ని పెంచే గ్రంథాలయాల అభివృద్ధికి ఇటు ప్రభుత్వాలు, అటు ప్రజలు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

బనగానపల్లె గ్రంథాలయంలో వేలాది పుస్తకాలతో ప్రదర్శన



గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



మనిషి జ్ఞానాన్ని పెంచి, భవిష్యత్తుపై భరోసా కలిగించే గ్రంథాలయాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలి. మన నాగరికత, చరిత్ర, వేదాలు, ఇతిహాసాలు, సాహిత్యం, పోటీ పరీక్షల పుస్తకాలు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్నాయి.

- రాజా మనోహర్, గ్రంథాలయ అధికారి

చెంచులకు ఉచిత స్పర్శదర్శనం

- ప్రత్యేక కార్డులతో నెలలో ఓసారి అవకాశం
- మల్లన్న భక్తులకు ఉచిత ప్రసాదం
- కొలనుభారతి ఆలయం దత్తతకు ఓకే
- శ్రీశైలం ఆలయ ట్రస్టు బోర్డు కమిటీ తీర్మానం
- 11 అంశాలు ఆమోదం



సమావేశంలో అంశాలపై చర్చిస్తున్న ట్రస్టుబోర్డు సభ్యులు, అధికారులు

శ్రీశైలం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మల్లన్న దర్శనంలో చెంచులకు మరింత వెసులుబాటు కల్పిస్తూ ట్రస్టుబోర్డు కమిటీ నిర్ణయం తీసుకుంది. నెలలో ఓసారి చెంచులకు మల్లన్న స్పర్శ దర్శనం కల్పించేలా నిర్ణయించారు. ఇందుకోసం చెంచులకు ప్రత్యేక కార్డులను కూడా జారీ చేయనున్నారు. బుధవారం శ్రీశైలం ట్రస్టుబోర్డు కమిటీ సమావేశమై పలు కీలక నిర్ణయాలను తీసుకుంది. చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, ఆలయ ఈవో శ్రీనివాసరావు, మండలి సభ్యులు ప్రత్యేక ఆహ్వానితులు, విభాగాధిపతులతో కలిసి కీలక అంశాలపై చర్చించారు. ప్రధానంగా 14 అంశాలు చర్చకురాగా 11 అంశాలను ఆమోదం తెలుపుతూ, రెండింటిని వాయిదా వేసి, మరో అంశాన్ని తిరస్కరించారు. ఇందుకు సంబంధించిన వివరాలను చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు వెల్లడించారు. డిసెంబరు 1వ తేదీ నుంచి స్వామివారి స్పర్శ దర్శనం చేసుకున్న భక్తులకు 100 గ్రాముల బరువుగల రెండు లడ్లు, అతిశీఘ్ర దర్శనం వారికి 100 గ్రాముల బరువుగల ఓ లడ్డూను ఉచితంగా అందించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. అదేవిధంగా ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీచేసి నెలలో ఒకసారి చెంచులకు ఉచిత స్పర్శ దర్శనం కల్పిస్తారు. దేవదాయశాఖ ఉత్తర్వుల మేరకు సరస్వతీదేవి కొలువై ఉన్న కొలనుభారతి దేవాలయాన్ని దత్తత తీసుకుని ఆలయానికి సంబంధించిన భూములు, బంగారు వెండి వంటివి స్వాధీనపరుచుని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. సంక్రాంతి బ్రహ్మోత్సవాలకు యాత్రికులకు తగు ఏర్పాట్లను సిద్ధం చేయడం, ప్రధానాలయంలోని శ్రీగోకులాన్ని ఆధునీకరించడం, క్షేత్ర పరిధిలోని ప్రధాన కూడళ్లలో సమాచార సూచిక బోర్డులతో పాటు 'మే ఐ హెల్ప్ యు' యాత్రిక సహాయ కేంద్రాలు, పరిపాలనా విభాగం, క్యూలైన్లు, ప్రసాదం కౌంటర్లు, అన్నదాన భవనం, ఆసుపత్రి, బస్టాండ్ వంటి కీలక ప్రాంతాల్లో ఫిర్యాదులు సలహాల పెట్టెలను ఏర్పాటు భక్తుల ఇబ్బందులను పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. సర్వ దర్శనం కోసం వేచిఉండే భక్తులకు తక్కువ సమయంలో దర్శనభాగ్యం కల్పించేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్ల క్షేత్రానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంరక్షించుకుంటూ పరిసరాలు సౌకర్యాల కల్పన చర్యలను మరింత మెరుగుపరిచే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

ఆదోని, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆదోని-ఇస్వీ రైల్వేస్టేషన్ల మధ్య బుధవారం 55 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు గల వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ సాయిసర్వేశ్వరరావు తెలిపారు. ఆదోని రైల్వేస్టేషన్ సమీపంలోని నల్లగేటు 495/34 కి.మీ. దగ్గర మృతదేహం లభ్యమైందని చెప్పారు. మృతుడి కుడి చేతిపై కేసీ, ఎన్టీఆర్ అనే అక్షరాలతో పచ్చ వేయించుకున్నాడని చెప్పారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లేవని, ఎవరైనా గుర్తిస్తే రైల్వే పోలీసులను సంప్రదించ వచ్చన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

జవాన్ మృతి


నాగార్జున (ఫైల్)

మద్దికెర, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక కురవ వీధిలో నివసించే జవాన్ కె.నాగార్జున (34) బుధవారం ఉదయం డెంగీ లక్షణాలు, పచ్చకామెర్ల వ్యాధితో మృతి చెందారు. వివరాలివీ.. నాగార్జున 2011లో ఇండో టిబెట్ బార్డర్ పోలీసుగా సైన్యంలో చేరారు. ఆరు సంవత్సరాల కిందట రాయదుర్గం మండలంలోని ఊటకల్లు గ్రామానికి చెందిన భారతిని వివాహం చేసుకున్నాడు. వీరికి శాన్వి అనే కూతురు కూడా ఉంది. అయితే.. బార్డర్ నుంచి వచ్చి తిరుపతి వద్ద గల కలికిరి క్యాంప్‌లో విధులు నిర్వహిస్తున్నారు. అయితే గత ఐదు రోజుల నుంచి జ్వరం వస్తుండటంతో సెలవుపైన గ్రామానికి వచ్చారు. జ్వరం తగ్గకపోవడంతో బళ్లారిలోని ఓ హాస్పిటల్‌లో చికిత్స తీసుకుంటున్నాడు. అయితే డెంగీ లక్షణాలు ఉండడం, పచ్చకామర్లు వ్యాధులు అధికం కావడంతో కోలుకోలేక మృతి చెందాడు. పోలీసులు పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఓపీడీ వైద్యశాలకు తరలించారు. అనంతరం మద్దికెర దహన సంస్కారాలు చేశారు. జవాన్ మృతి పట్ల పంచాయతీ సలహాదారు బండారు ఆంజనేయులు, టీడీపీ మండల అధ్యక్షుడు ఎస్.లక్ష్మీనారాయణ, కురువ సంఘం నాయకులు గ్రామ ప్రజలు సంతాపం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

మహానంది, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారామపురం వద్ద మంగళవారం అర్ధరాత్రి మోటర్‌బైక్‌ను ట్రాక్టర్ ఢీకొట్టడంతో గోపవరం గ్రామానికి చెందిన వెంకటకృష్ణ(22) అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి బుధవారం తెలిపిన వివరాలివీ.. వెంకటకృష్ణ నంద్యాలోని రైల్వే స్టేషన్‌లో కుటుంబ సభ్యులను రైలు ఎక్కించి తిరిగి స్వగ్రామానికి తిమ్మయ్యతో కలసి బైకుపై బయలుదేరారు. సీతారామపురం గ్రామం సమీపంలో పొలం నుంచి లోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. వెంకటకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన తిమ్మయ్యను చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


వెంకటకృష్ణ (ఫైల్)

రేపటి నుంచి అప్లికేషన్ డెవలపర్, డ్రోన్ ఆపరేటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణలో భాగంగా శుక్రవారం నుంచి డ్రోన్ ఆపరేటర్, అప్లికేషన్ డెవలపర్‌లపై శిక్షణలు ప్రారంభిస్తున్నట్లు మహా యోగి లక్ష్మమ్మ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ మహబూబ్ బాషా, నైపుణ్య అభివృద్ధి కో ఆర్డినేటర్ సుధాకర్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్, డిగ్రీ చదివి ఆసక్తి ఉన్న వారు మహాయోగి లక్ష్మమ్మ డిగ్రీ కాలేజీ కొ ఆర్డినేటర్ సుధాకర్‌ను కలసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 8885904099 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.


మహబూబ్ బాషా

ఆర్టీసీ బస్సులో పొగలు

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కోసిగి నుంచి ఎమ్మిగనూరుకు వస్తున్న ఆర్టీసీ బస్సులో ఆకస్మాతుగా పెద్ద ఎత్తున పొగలు రావడంతో బస్సులోని ప్రయాణికులు భయభ్రాంతులకు గురై పరుగులు పెట్టారు. వివరాలివీ.. కోసిగి నుంచి మాలపల్లి మీదుగా ఎమ్మిగనూరుకు వస్తున్న బస్సు సాయంత్రం 6గంటల సమయంలో వడ్డికి రవ్వ వంక దగ్గర ఉన్న పెట్రోలు బంకు సమీపంలోకి రాగానే బస్సులోని సైలెన్సర్ దగ్గర నుంచి పెద్ద ఎత్తున పొగలు వచ్చాయి. గమనించిన డ్రైవర్ అప్రమత్తమై బస్సును పక్కకు నిలిపి ప్రయాణికులను బస్సులో నుంచి సురక్షితంగా దించివేశారు. దీంతో ప్రయాణికులు ఊపిరి పిల్చుకున్నారు. కండక్టరు ప్రయాణికులను వేరే బస్సులో వారి గమ్యానికి తరలించారు. దాదాపు 90 మంది ప్రయాణికులు ఉన్నట్లు కండక్టరు తెలిపారు.


పొగలు వచ్చిన బస్సు ఇదే

పత్తి మిల్లులో అగ్నిప్రమాదం


మంటలను అర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

నంద్యాల టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బొగ్గులైన్‌లోని బీసీజీ పత్తి మిల్లులో బుధవారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. బాధితులు నాగరాజు, నాగప్రసాద్, జిల్లా అగ్నిమాపక సహాయక అధికారి రఘునాథ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పత్తిమిల్లులోని ఓ మిషన్ నుంచి ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. స్పందించిన సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సుమారుగా 40 బేళ్ల పత్తి మంటల్లో కాలిపోయింది. విలువైన పరికరాలు కూడా దగ్ధం కావడంతో సుమారుగా రూ.80 లక్షలు వరకు ఆస్తి నష్టం వాటిల్లింది. ప్రమాదంపై విచారణ చేస్తున్నట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు.

రేపటి నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

కర్నూలు అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో ఈనెల 21 నుంచి డిసెంబరు 20 వరకు డిగ్రీ 3, 5 సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పరీక్షల విభాగం కంట్రోలర్ డా.ఎస్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలోని 52 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు 3వ సెమిస్టర్‌లో రెగ్యులర్ 7,555, సప్లిమెంటరీలో 5,595 మంది, 5వ సెమిస్టర్లో రెగ్యులర్ 6,520, సప్లిమెంటరీలో 2,717 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకుని ఐడెంటీ కార్డుతో అరగంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని కంట్రోలర్ తెలిపారు.

కర్నూలులో స్టేట్ తలసేమియా సెంటర్

- రెడ్‌క్రాస్ సొసైటీ ఆవరణలో ఏర్పాటు
- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్


టీజీ వెంకటేశ్‌తో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

కర్నూలు హాస్పిటల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మొదటిసారిగా కర్నూలు రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ ఆవరణలో స్టేట్ అడ్వాన్స్‌డ్ తలసేమియా సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. బుధవారం రెడ్‌క్రాస్ సొసైటీ ఆవరణలో సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి సభ్యులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. తమిళనాడు, డిల్లీ రాష్ట్రాల తరహాలో గర్భిణులకు తలసేమియా వ్యాధిని గుర్తించే జనిటిక్ టెస్టులను ఇక్కడే చేస్తారన్నారు. భవన నిర్మానానికి సంపూర్ణ సహకారాన్ని అందిస్తానని టీజీ హామీ ఇచ్చారు. అనంతరం రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డా.గోవిందరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో వెయ్యి మంది తలసేమియా బాధితులు ఉన్నారని, వీరికి ప్రతి నెల రెండు, మూడుసార్లు రక్తమార్పిడి, మూడు నెలలకు బ్లడ్ టెస్టులు అవసరమని అన్నారు. వీరికి సైన సేవలందక మృతి చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు డా.కేవీ సుబ్బారెడ్డి, మీనాక్షి, గార్గేయపురం శ్రీనివాసులు, మాజీ కార్పొరేటర్ బాబురాజ్ పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యల నివారణలో ప్రభుత్వాలు విఫలం

- అఖిల భారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షుడు రాజన్ క్షీరసాగర్.. ముగిసిన పత్తి రైతుల రాష్ట్ర సమ్మేళనం



మాట్లాడుతున్న రాజన్ క్షీరసాగర్

దోని అగ్రికల్చర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): దేశంలో పంటలకు సరైన గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వాటిని నివారించడంలో ప్రభుత్వాలు విఫలం చెందుతున్నాయని అఖిలభారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షుడు రాజన్ క్షీరసాగర్ అన్నారు. ఆదోనిలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి పత్తి రైతుల సమ్మేళనం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా రాజన్ మాట్లాడుతూ దేశంలో 60 కోట్ల మంది రైతులు ఉండగా అందులో 60 లక్షల మంది రైతులు పత్తిని పండిస్తున్నారన్నారు. పత్తికి సరైన గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు చేస్తున్న మోసాలపై కేంద్ర ప్రభుత్వంపై పోరాడుతూనే ఉన్నామన్నారు. పేదరికం తగ్గిస్తామని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించి వ్యవసాయాన్ని లాభసాటి చేస్తామన్న ప్రభుత్వాలు నేడు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ నల్ల చట్టాలపై డిల్లీ రైతులు చేసిన పోరాటంపై మోదీ రద్దు చేస్తామని ఇచ్చిన హామీని నేటికీ నిలబెట్టుకోలేదన్నారు. పంటల మద్దతు ధరకు వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ స్వామి నాథన్ సిఫారస్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. విదేశీ దిగుమతులపై 11 శాతాన్ని విధిస్తున్న సుంకాన్ని రద్దు చేయడం దుర్మార్గం అన్నారు. ఎరువుల కంపెనీలకు ఇస్తున్న రాయితీలను నేరుగా రైతులకే ఇవ్వాలన్నారు. వ్యవసాయ ఆధారిత పనిముట్ల ఎరువులు విత్తనాలపై విధించిన జీఎస్టీని పూర్తిగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పత్తికి కనీస మద్దతు ధర రూ.12 వేలు కల్పించి పత్తి రైతులకు బోనస్ ఇవ్వాలని కోరారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య, రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, కార్యదర్శి జగన్నాథం, గిడ్డయ్య, టీ వీరేష్, పారిశ్రామికవేత్త బత్తిని కుబేర్నాథ్ వెల్లాల మధుసూదన్ శర్మ, రేణుకాంబ స్వామి, శ్రీనివాసులు, రాజశేఖర్, సుదర్శన్, కల్లుబావి రాజు పాల్గొన్నారు.

రైతు అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి
- రైతులకు అన్నదాత సుఖీభవ మెగా చెక్కు విడుదల


ఓర్వకల్లులో రైతులకు చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఓర్వకల్లు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతు అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, వారికోసమే సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నట్లు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. బుధవారం ఓర్వకల్లులోని పొదుపు ఐక్య సంఘం ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ రెండో విడత చెక్కులను విడుదల చేశారు. ముందుగా సీఎం చంద్రబాబు సీఎం చంద్రబాబు ప్రసంగాన్ని తిలకించారు. అనంతరం కేక్ కట్ చేసి రైతులతో కలిసి సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓర్వకల్లు, గడివేముల, పాణ్యం, కల్లూరు మండలాలకు చెందిన 27,378 రైతులకు రూ.22,02 కోట్లు రెండో విడత అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులను విడుదల చేశామన్నారు. గత ప్రభుత్వం వ్యవసాయాన్ని చిన్నచూపు చూసిందని విమర్శించారు. తాము రైతు సంక్షేమమే ధ్యేయంగా అన్నదాత సుఖీభవ నిధులు జమ చేశామన్నారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్‌పథకాల్లో భాగంగా రైతులు నష్టపోకూడదన్న లక్ష్యంతో అన్నదాత సుఖీభవ నిధులు ఇవ్వడం జరిగిందన్నారు. ఇచ్చిన మాటకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పంట సాగు పెట్టుబడికి రైతులు ఇబ్బందులు పడకుండా రూ.20వేలు ఇవ్వడం హర్షణీయమన్నారు. నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, ఏడీఏ రాజశేఖర్, తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో నాగ అనసూయ, నాలుగు మండలాల సొసైటీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు మహిళలు భారీ ఎత్తున పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న అర్చకులు, పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ అనూరాధ

అహోబిలంలో సుదర్శన హోమం

పాల్గొన్న టీడీపీ ఎమ్మెల్సీ అనూరాధ

ఆళ్లగడ్డ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అహోబిలంలో లక్ష్మీ నరసింహస్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా బుధవారం స్వామి, అమ్మవార్లుకు ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాల్ స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దిగువ అహోబిలంలో ఆలయ ప్రాంగణంలో స్వాతి సుదర్శన హోమాన్ని వేద పండితులు నిర్వహించారు. ఈవేడుకలలో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

హోమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ అనూరాధ...

విజయవాడకు చెందిన టీడీపీ ఎమ్మెల్సీ అనూరాధ అహోబిలం లక్ష్మీనరసింహస్వామికి పూజలు చేశారు. ఎమ్మెల్సీ ఆలయానికి చేరుకోగానే ఆలయ అధికారులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. హోమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ లక్ష్మీనరసింహస్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా స్వామిని దర్శించుకునేందుకు వచ్చినట్లు చెప్పారు.

'దేవరగట్టు' మృతుడి కుటుంబానికి చేయూత

- రూ.లక్ష అందజేసిన తానా డైరెక్టర్ పొట్లూరి రవి


అంజనేయ భార్య ఈరమ్మకు చెక్కు ఇస్తున్న పొట్లూరు రవి

కర్నూలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తానా బోర్డ్ ఆఫ్ డైరెక్టర్, ఎన్ఆర్ఐ పొట్లూరు రవి సహా ఎన్నారైలు మరోసారి దాతృత్వం చాటుకున్నారు. కర్నూలు జిల్లా హొళగుంద మండలం దేవరగట్టు బన్ని ఉత్సవంలో జరిగిన తొక్కిసలాటలో ఆదోని పట్టణం అరుణజ్యోతి నగర్‌కు చెందిన చిన్న ఆంజనేయ మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబానికి పొట్లూరి రవి ఆర్థికసాయం చేసి అడగా నిలిచారు. అత్యంత నిరుపేద అయిన ఆంజనేయ మరణంతో ఆయన భార్య ఈరమ్మ, ముగ్గురు పిల్లలు అనాథలుగా మారారు. రెక్కాడితే కాని పూట గడవని ఆ కుటుంబం కష్టాల్లో కూరుకుపోయింది. చిన్న ఆంజనేయ హిందూపురం ఎమ్మెల్యే, హీరో నందమూరి బాలకృష్ణకు వీరాభిమాని. ఆయన చేతిపై ఎన్‌బీకే అక్షరాలు పచ్చబొట్టు కూడా వేయించుకున్నాడు. మృతుడి కుటుంబ దీనస్థితిని బాలకృష్ణ అభిమాన సంఘం పొట్లూరి రవి దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన తానా బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ పొట్లూరి రవి, ఎన్నారైలు వెంకట్ సుంకర, వేణు కోడే, సుబ్రమణ్యం ఒసురు తదితరులు రూ.లక్ష ఆర్థిక సాయం చెక్కును మృతుడి భార్య ఈరమ్మ, కుమారుడు రామాంజిలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ అభిమాన సంఘం అధ్యక్షుడు సుధాకర్ నాయుడు, సందడి మధు, మీనాక్షి, మనోహర్ చౌదరి, బాబు, మార్కండి, నాగరాజ్, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

డీడీఓ భవనాలకు హంగులు

(5వ పేజీ తరువాయి)

ముగ్గురు డివిజన్ స్థాయి అధికారుల పాలనా వ్యవహారాలు ఇక నుంచి ఈ కార్యాలయం నుంచే కొనసాగనున్నాయి. ఈ ముగ్గురు అధికారుల కార్యాలయాలకు అనుగుణంగా ఈ భవనాల్లో సౌకార్యలు కల్పిస్తున్నారు. ఇందుకు జిల్లా పరిషత్ నిధులు రూ.95.70 లక్షలు కేటాయించారు. ఈ నిధులతో కార్యాలయాల్లో వివిధ రకాల అభివృద్ధి పనులను చేపడుతున్నారు. అలాగే ఆరు డివిజన్ కేంద్రాల్లోని ఈ కార్యాలయాల్లో ఫర్నిచర్ మొదలైన వాటికి అదనంగా మరో రూ.10 లక్షలు కేటాయించారు. ఇప్పటికే ఈ భవనాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు దాదాపు పూర్తి అయినట్లు జిల్లా పరిషత్ సీఈవో నాసరరెడ్డి తెలిపారు. ప్రతి డీడీఓ కార్యాలయానికి అవసరమైన మేర సిబ్బందిని కూడా డిప్యుటేషన్ పద్ధతిపై నియమించనున్నారు. ఒక్కో డీడీఓ కార్యాలయానికి ఒక సూపరింటెండెంట్, ఒక సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, టైపిస్టు, ఇద్దరు అటెండర్లను నియమించనున్నారు. ప్రతి డివిజన్‌కు ప్రత్యేకంగా నియమితులైన డీడీఓ ఆయా డివిజన్లలోని గ్రామ/వార్డు సచివాలయాల పర్యవేక్షణతో పాటు గ్రామ పంచాయతీల అభివృద్ధి, పన్ను వసూళ్ల అంశాలను పర్యవేక్షించనున్నారు.

ఒక్కో డివిజన్‌కు కేటాయించింది ఇలా:

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఆరు డివిజనల్ డెవలప్‌మెంట్ కార్యాలయాల భవనాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు జడ్పీ సాధారణ నిధులు రూ.95.70 లక్షలు కేటాయించారు. ఇందులో ఆదోని డీడీఓ కార్యాలయానికి రూ.16.50 లక్షలు, పత్తికొండకు రూ.19.00 లక్షలు, కర్నూలుకు రూ.15.00 లక్షలు, ఆత్మకూరుకు రూ.15.00 లక్షలు, నంద్యాల రూ.15.00 లక్షలు, డోన్‌కు రూ.14.00 లక్షలు కేటాయించారు.

విద్య, వైద్యం కోసం ఉద్యమం

• వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి



సంతకాలు చేస్తున్న వైద్య విద్యార్థులు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్య, వైద్య హక్కుల పరిరక్షణకు ఉద్యమం చేస్తున్నట్లు వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కృష్ణదేవరాయ కూడలిలో కోటి సంతకాల సేకరణ చేశారు. ప్రజా ప్రయోజనాల కోసం జరుగుతున్న ఈ మహా పోరాటానికి ప్రజలు, కార్యకర్తలు మరింత ఉత్సాహన్ని నింపారన్నారు. మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ, కోడుమూరు ఇన్‌చార్జి ఆదిమూలపు సతీష్, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

● జిల్లా అభివృద్ధి-పార్టీ అభివృద్ధి దిశగా ఎస్వీ మోహన్‌రెడ్డి పార్టీ నాయకులతో భేటీ అయ్యారు. ఆలూరు నియోజకవర్గం చిప్పగిరి కన్వీనర్ మారయ్య, ఎంపీపీలు, ఎస్వీని కలిసారు.

స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలి

• సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్ దేశాయ్



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఓర్వకల్లు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. బుధవారం ఓర్వకల్లులో సీపీఎం మండల కార్యదర్శి నాగన్న అధ్యక్షతన తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. పరిశ్రమల కోసం భూములు కోల్పోయిన రైతులకు పదేళ్ల గడుస్తున్నా నష్టపరిహారం అందలేదన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూములు కోల్పోయిన రైతులకు న్యాయమైన నష్టపరిహారం చెల్లించి, వారి పిల్లలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. పరిశ్రమల్లో బీహార్, రాజస్థాన్, చతీష్‌ఘడ్, బెంగాల్, హర్యాణా నుంచి కార్మికులను తీసుకువచ్చి పనిచేయిస్తున్నారని మండిపడుతు న్నారు. అనంతరం డీటీ సతీష్ కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. వితంతువులకు పింఛన్లను పునరుద్ధరించాలని ఎంపీడీవో అనసూయకు వినతి పత్రం సమర్పించారు. మధుసూదన్, నాగరాజు, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ

సి.బెళగల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సమావేశ భవనంలో బుధవారం కార్యదర్శులు, సర్పంచులకు పంచాతీల అభివృద్ధిపై ఎంపీడీవో రాణెమ్మ శిక్షణ ఇచ్చారు. నిర్వహించారు. పంచాయతీల్లో తాగునీరు, సీసీ రోడ్లు, కాలువలు, వీధి దీపాలు, చేతి పంపులపై దృష్టి పెట్టాలని, ఇంటిపన్నుల వసూలుపై నిర్లక్ష్యం వహించవద్దన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో

అభివృద్ధిలో ప్రభుత్వం విఫలం

గూడూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాను అభివృద్ధి చేయడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కేవీ నారాయణ ఆరోపించారు. బుధవారం సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి మోహన్ అధ్యక్షతన పాత బస్టాండ్‌లో జీపు జాత నిర్వహించారు. సాగు నీటి ప్రాజెక్టులు నిర్మించడంలో వైఫల్యం చెందిందన్నారు వెంకటేశ్వర్లు, దానమన్న, మద్దిలేటి, మధు తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌ను నియమించాలి

కర్నూలు అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలకు ప్రిన్సిపాల్‌ను నియమించాలని భీమ్ ఆర్మీ రాష్ట్ర కన్వీనర్ ఎస్ విజయభాస్కర్ కోరారు. బుధవారం వీసీ వెంకట బసవరావుకు వినతి పత్రం ఇచ్చారు. ఏడాది నుంచి ప్రిన్సిపాల్ లేకపోవడంతో జూనియర్ విద్యార్థులు ర్యాగింగ్‌కు గురవుతున్నారని తెలిపారు. దానం, రాజా తదితరులు పాల్గొన్నారు.



వీసీకి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

పొగ తాగితే సీవోపీడీ జబ్బు

కర్నూలు హాస్పిటల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బీడీ, సిగరెట్ తాగితే సీవోపీడీ జబ్బు 90 శాతం వచ్చే ప్రమాదం ఉందని ఊపిరితిత్తుల వ్యాధినిపుణుడు డా.జి.కుల్లాయప్ప హెచ్చరించారు. బుధవారం రెవెన్యూ కాలనీలో క్లినికల్‌లో ప్రపంచ సీవోపీడీ దినోత్సవం సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సిగరెట్, బీడీ తాగితే శ్వాసనాళాలు దెబ్బతిని పాడవుతాయన్నారు. శ్వాస ఆడకపోవడం, గాలి ఊపిరితిత్తులకు చేరుకోలేక రోగి దగ్గు, ఆయాసం, ఛాతీ బిగుసుకుపోవడం, పిల్లికూతలు వస్తాయన్నారు.



మందులను పంపిణీ చేస్తున్న డా.కుల్లాయప్ప

అంతా మా ఇష్టం..!

• సి. క్యాంపు రైతు బజార్‌లో అడ్డదిడ్డంగా దుకాణాల నిర్మాణం
• చోద్యం చూస్తున్న అధికారులు



రైతుబజార్ రెండో గేటువైపు అడ్డంగా నిర్మించిన దుకాణం

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 19ఆంధ్రజ్యోతి): నగరంలో సి.క్యాంపు రైతుబజార్‌లో దళారుల ఇష్టారాజ్యం కొనసాగుతోంది. కొంతకాలం పాటు రైతులు, పొదుపు మహిళలకు ప్రాధాన్యమిచ్చారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాజకీయ నాయకుల ప్రాబల్యం పెరిగి, రైతులకు ప్రాధాన్యం తగ్గిపోయింది. ప్రస్తుత టీడీపీ ప్రభుత్వ హయాంలో కూడా ఇదే కొనసాగుతోంది. కనీసం నిలిచేందుకు కూడా స్థలం లేక వినియోగదారులు ఇబ్బంది పడుతుంటే అడ్డ దిడ్డంగా దుకాణాలు నిర్మించేస్తున్నారు. దీంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నిబంధనల ప్రకారమే దుకాణాలు



సి.క్యాంపు రైతుబజారులో మార్కెటింగ్ శాఖ అధికారుల సూచనల మేరకే దుకాణాలను నిర్మిస్తున్నాం. రైతుబజార్ లేఅవుట్ ప్రకారమే దుకాణాలను నిర్మించాం. వాటిని ఎవరికి కేటాయించాలన్నది మా పరిధిలో లేదు. ఆ వ్యవహారాలన్నీ సంబంధిత అధికారులే చూస్తున్నారు.
- రఘునాథరెడ్డి, డీఈఈ, మార్కెటింగ్ శాఖ, కర్నూలు.

సచివాలయాల బాధ్యత నోడల్ అధికారులదే

• నగర పాలక సంస్థ కమిషనర్ విశ్వనాథ్



కర్నూలు న్యూసిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా పర్యవేక్షించాల్సిన బాధ్యత నోడల్ అధికారులదే అని నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ సూచించారు. బుధవారం నూతన నోడల్, సహాయ నోడల్ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. నగర ప్రజలు సచివాలయాల్లో మెరుగైన ప్రభుత్వ సేవలు పొందేలా 15 మంది నోడల్ అధికారులు, మరో 10 మందిని నియమించామన్నారు. 14 రకాల సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మించాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

సి.బెళగల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర నది సమీపాన గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాంచాలని కోడుమూరు, గూడూరు, సిబెళగల్ గ్రామాల సీపీఎం నాయకులు కోరుఆరు. బుదవారం జీపుజాతను నిర్వహించారు. తిమ్మనదొడ్డి, సంగాల, పల్దొడ్డి, కొండాపురం, ముడుమాల, శింగవరం, ఈర్లదిన్నె, కొత్తకోట గ్రామాల్లో డ్యామ్ గూర్చి వివరించారు.

పరిశుభ్రతతో ఆరోగ్యకరమైన సమాజం

కర్నూలు న్యూసిటీ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యమైన సమాజం సాధ్యమని నగర పాలక అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవి.కృష్ణ అన్నారు. బుధవారం నగరంలోని బి.క్యాంపు బాలికల పాఠశాలలో 'డెటాల్ బనేగా స్వస్థ్ ఇండియా'లో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ఇంటిలో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవడం సమాజ ఆరోగ్యానికి ఎంతో అవసరమని అన్నారు. భోజనానికి ముందు, తరువాత అలాగే మలవిసర్జన తరువాత చేతులు కడుక్కుంటే రోగాలను నివారించవచ్చని ఆయన వివరించారు. అనంతరం వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం సునీత, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పుల్లన్న, హుసేన్, టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.



డ్రాయింగ్‌ను పరిశీలిస్తున్న అడిషనల్ కమిషనర్ కృష్ణ

ఆర్‌యూ రిజిస్ట్రార్‌ను తొలగించాలి

• వీసీ చాంబర్‌ను ముట్టడించిన విద్యార్థి నాయకులు

కర్నూలు అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న రిజిస్ట్రార్‌ను తొలగించాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఆర్‌వీఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం రాయలసీమ యూనివర్సిటీ వీసీ చాంబర్‌ను ముట్టడించారు. గంట సేపు వీసీ చాంబర్‌లో బైఠాయించి రిజిస్ట్రార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్యార్థులను సముదాయించేందుకు ప్రొఫెసర్లు, ఆధ్యాపకులు మల్లగుల్లాలు పడ్డారు. విద్యార్థి నాయకులు ఎస్. శరత్ కుమార్, నాగార్జున, నాగరాజు మాట్లాడుతూ రిజిస్ట్రార్ వర్సిటీని వివాదాలకు నిలయంగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఈడీ కళాశాలల అవినీతి, అక్రమాలకు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. స్థానిక ప్రొఫెసర్లకు రిజిష్ట్రార్‌గా అవకాశం కల్పించాలని, ఇతర వర్సిటీల వారికి పెత్తనం ఇస్తే నిధలను దుర్వినియోగం చేస్తున్నారని ప్రశ్నించారు. నాయకులు అలీ, రాము, భూపాల్, సాయి, బాలాజీ, మునీంద్ర, శ్రీనాథ్, మధు తదిరులు పాల్గొన్నారు.



వీసీతో మాట్లాడుతున్న విద్యార్థి నాయకులు

పేదల ఆశాకిరణం ఇందిరా గాంధీ



నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కర్నూలు అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నిరుపేదల ఆశాకిరణం ఇందిరా గాంధీ అని సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జీలానీ బాషా అన్నారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఇందిరా గాంధీ 108వ జయంతి నిర్వహించారు. దేశం కోసం ప్రా ణత్యాగం చేసిందనప్పారు. పాక్ నుంచి బంగ్లాదేశ్ విముక్తికి సాయం చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఐన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బతుకన్న, మహేంద్ర నాయుడు, నాయకులు అనంతరత్నం మాదగా, క్రాంతి నాయుడు, దామోదరం రాధకృష్ణ, బి. సుబ్రమణ్యం, షేక్ ఖాజా హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

అవోపా ఆధ్వర్యంలో బహుమతులు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

కర్నూలు కల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అవోపా కర్నూలు శాఖ ప్రతినిధులు బుధవారం నగరంలోని ప్రకాశ్‌నగర్ టంగుటూరి ప్రకాశం పంతులు స్మారక నగరపాలక ఉన్నత పాఠశాల్లో ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకుబహుమతుల అందజేశారు. హెచ్ఎం ఖాజా హుస్సేన్, ఉపాధ్యాయులు సునీల్, రాజ్యలక్ష్మి, కె.సుబ్రహ్మణ్యం, అవోపా మహిళా అధ్యక్షురాలు మాధవి, కోశాధికారి శ్రీవాణి, అవోపా అధ్యక్షుడు డాక్టర్ పి. లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో జ్ఞానం

సి. బెళగల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో జ్ఞానం పెంచుకోవచ్చని ఎంఈవో జ్యోతి, ఎంపీడీవో రాణెమ్మ అన్నారు. 58 గ్రంథాలయ వారోత్సవాలలో బాగంగా నిర్వహకుడు రమణ గ్రంథాలయంలో పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. వార్తపత్రికలు, కథల పుస్తకాలు, నవలలు ఉంటాయన్నారు.



అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

పరీక్షలను రద్దు చేయాలి

కర్నూలు అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): బీఈడీ 3వ సెమిస్టర్ పరీక్షలను రద్దు చేయాలని ఏఎస్‌ఏ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర డిమాండ్ చేశారు. బుధవారం ఆర్‌యూ వీసీ వెంకట బసవరావుకు వినతి పత్రం ఇచ్చారు. బ్లాక్ బోర్డు టీచింగ్ అవకతవకవలపై డీఈవో ఇచ్చిన నివేదిక ఆధారంగా పరీక్షలు రద్దు చేయాలన్నారు. బ్లాక్ బోర్డు టీచింగ్ నిర్వహించకుండానే కొంత మంది బీఈడీ కళాశాలలు రికార్డులు చూపించాయని, ఇటీవల డీఈవో కార్యాలయం విచారణలో వెలుగులోకి వచ్చిందన్నారు. అవకతవకలకు పాల్పడిన కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వ్యాస రచన పోటీలు

ఓర్వకల్లు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. బుధవారం మండలంలోని నన్నూరు, ఓర్వకల్లు గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో స్వాతంత్ర సమరంపై పోటీలు, నిర్వహించారు. గ్రంథాలయ అధికారులు కౌసల్య, హేమే నాయక్, ఉపాధ్యాయులు నిర్మల వసంత కుమారి, శ్రీరామకృష్ణ, లక్ష్మీనారాయణ, శ్రీకాంత్ విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ



మంత్రితో ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర వినియోగదారుల, వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని ఎంపీ బస్తిపాటి నాగరాజు కలిశారు. బుధవారం డిల్లీలోని మంత్రి కార్యాలయంలో జిల్లాకు అవసర మైన సహకారం, తదితర అంశాలపై చర్చిం చారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటి సమావేశంలో పాల్గొని సమీక్షించారు.

పారిశుధ్య మెరుగుకు చర్యలు తీసుకోవాలి

• డీపీవో భాస్కర్

కల్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు సిబ్బంది చర్యలు తీసుకోవాలని డీపీవో జి.భాస్కర్ ఆదేశించారు. బుధవారం చిన్నటేకూరు గ్రామంలో పర్యటించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడీఓ, సెక్రటరి గోవిందు పాల్గొన్నారు.

● ఎల్ఎస్‌డీజీ థీమ్-5, పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడంపై ఎంపీడీవో జి.నాగేశాచలరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఒక రోజు శిక్షణ నిర్వహించారు.

24న హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24న ఆదర్శ విద్యామందిర్ క్రీడా మైదానంలో జిల్లా స్థాయి సబ్ జూనియర్ (అండర్-15) బాలికలు, జూనియర్ (అండర్-19 బాలురు) క్రీడాకారుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు సంఘం కార్యదర్శి సువర్ణ తెలిపారు. డిసెంబరు 1, 2 తేదీల్లో పిడుగురాళ్లలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారన్నారు. రూ.10లు చెల్లించి 24వ తేదీ ఉదయం 10 గంటల నుంచి ఎంపికలో నేరుగా పాల్గొనవచ్చని తెలిపారు.

నేడు కలెక్టరేట్ వద్ద కార్మికుల ధర్నా

కర్నూలు న్యూసిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్లు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.నరసింహులు బుధవారం ప్రకటనలో తెలిపారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే బోర్డును పునరుద్ధరిస్తామన్న టీడీపీ పట్టించుకోలేదన్నారు.

కేఎంసీలో ఫిజియాలజీ సెమినార్

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కర్నూలు వైద్య కళాశాల ఫిజియాలజీ విభాగం ఆధ్వర్యంలో 'హెల్తీ పీపుల్ బిల్డ్ హెల్తీ నేషన్'అంశంపై బుధవారం సెమినార్ నిర్వహించారు. ఫిజీయాలజీ హెచ్‌వోడీ డా.ఏ.సుధారాణి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, జీవనశైలిని, ఫిజియాలజిస్టుల పాత్రను వివరించారు. డా.జి.రాధిక, డా.ఆర్.ఎలిజబెత్ రాణి, డా.ఎస్.లక్ష్మి వివిధ అంశాలను వివరించారు.

అభివృద్ధికి కృషి చేయాలి

ఓర్వకల్లు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అభివృద్ధి, పచ్చదనం, పరిశుభ్రతకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎంపీడీవో అనసూయ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సుస్థిర వృద్ధి లక్ష్యాలపై సర్పంచులు, ఉప సర్పంచులు, కార్యదర్శులకు మొదటి రోజు శిక్షణ ఇచ్చారు. పచ్చదనం కోసం మొక్కలు నాటాలని కోరారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో అనసూయ

కాల్వబుగ్గలో సోమిశెట్టి పూజలు

ఓర్వకల్లు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో బుధవారం కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు పూజలు చేశారు. ఆలయ చైర్మన్ కాటినేని నారాయణ, ధర్మకర్త కాకి దేవేంద్ర, ఆలయ ప్రధాన అర్చకులు కల్లె లక్ష్మీనారాయణ శర్మ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అర్చకులు కల్లె లక్ష్మీనారాయణ శర్మ సోమిశెట్టిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఈవో మద్దిలేటి, ధర్మకర్తలు పాల్గొన్నారు.



సోమిశెట్టిని సన్మానిస్తున్న అర్చకులు

ఎన్జీవోస్ అసోసియేషన్ బలోపేతమే లక్ష్యం



సభ్యత్వం తీసుకుంటున్న ఉద్యోగులు

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ బలోపేతమే తమ లక్ష్యమని జిల్లా అధ్యక్షుడు కాశన్న అన్నారు. బుధవారం నగరంలో లోకల్ ఫండ్ ఆడిట్, సర్వజన వైద్యశాల, ఫార్మసీ ఆఫీసర్లకు సభ్యత్వ నమోదు నిర్వహించారు. రమేష్‌బాబు, రామకృష్ణ, హరికృష్ణగౌడు, సంయుక్త కార్యదర్శి సుజాత, విజయ్ కృష్ణ పాల్గొన్నారు.

సమాజంలో పురుషుల పాత్రను గుర్తించాలి

• డీఎంహెచ్‌వో డా. భాస్కర్



ఉద్యోగులతో కలిసి కేక్ కట్ చేస్తున్న డీఎంహెచ్‌వో

కర్నూలు హాస్పిటల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సమాజంలో పురుషుల పాత్రను గుర్తించాలని డీఎంహెచ్‌వో డా.ఎల్.భాస్కర్ అన్నారు. ఇంటర్నేషనల్ మెన్స్ డే ను పురస్కరించుకుని బుధవారం కార్యాలయంలో మహిళా ఉద్యోగులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డా.జఫ్రుల్లాతో కలిసి కేక్ కట్ చేశారు. నవంబరు 19న ఇంటర్నేషనల్ మెన్ డే నిర్వహించి, పురుషుల శ్రేయస్సును ప్రోత్సహిస్తున్నామన్నారు. న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డా.మల్లికార్జున రెడ్డి, కార్యాలయ ఏవో అరుణ, సీనియర్ అసిస్టెంట్లు ఫణిభూషణ్, మధుసూదన్, విశ్వనాథ్, లోకసాయి, భూపాల్ పాల్గొన్నారు

రిజర్వాయర్‌ను నింపాలి

కల్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చెన్నరాయుని తిప్ప రిజర్వాయర్‌ను నీటితో నింపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధరా నిర్వహించారు. కల్లూరు మండలం ఉలిందకొండ, చిన్నటేకూరు, తడకనపల్లె, కెపి.తాండ చెరువులకు హంద్రీనీవా కాల్వ నీటితో నింపాలన్నారు. చెన్నరాయునితిప్పను నీటితో నింపితే 8వేల ఎకరాల సాగుభూములకు, 10 గ్రామాల ప్రజలకు తాగు, సాగునీరు అందించవచ్చన్నారు. దూపాడు, బొల్లవ రం, ఉలిందకొండ గ్రామాల్లో సాగు చేస్తున్న భూములకు పట్టాలి వ్వాలని డిమాండ్ చేవారు. పత్తి, మొక్కజొన్న, ఉల్లి రైతులకు ఎకరాకు రూ.20వేలు పరిమారం అందిం చాలని డిమాండ్ చేశారు. అనంతరం డీటీ విష్ణుప్రసాద్‌కు వినతిపత్రం అందిచారు. బి.మధు, ఏ.కృష్ణతో పాటు మద్దిలేటి, షేక్షావలి, గోపాల్, గోపి, రాజు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

మహిళా శక్తికి నిదర్శనం



డిగ్రీ కళాశాలలో నివాళి అర్పిస్తున్న ఆధ్యాపకులు

కర్నూలు అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహిళా శక్తికి నిదర్శనం ఝాన్సీ లక్ష్మిబాయ్, ఇందిరా గాంధీ, సమర యోధులని ప్రిన్సిపాల్ ఇందిరాశాంతి అన్నారు. బుధవారం ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో ఇందిరా గాంధీ, ఝాన్సీ లక్ష్మి బాయి జయంతి సందర్భంగా నివాళి అర్పించారు. 1857లో జరిగిన ప్రథమ భారత స్వాతంత్ర సంగ్రామంలో బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన మొదటి మహిళ ఝాన్సీబాయ్, దేశ తొలిప్రధానిగా ఇందిరా గాంధీ నేటి మహిళలకు స్ఫూర్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా. ఫక్రున్నీసా బేగం, ఆధ్యాపకులు మాదన్న, రోషన్న, ఆది నారాయణ, నాగరత్న, హేమలత, సోమశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు
● అన్నదాత సుఖీభవ పథకంతో రైతులకు లబ్ధి
● ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి


తుగ్గలి:అన్నదాత సుఖీభవ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

తుగ్గలి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతుల పక్షపాతి అని, రైతు అభివృద్ధే ధ్యేయంగా సబ్సిడీ కింద రైతులకు బిందుసేద్యం పరికరాలు అందించడంతో పాటు, అన్నదాత సుఖీభవ పథకం కింద నగదు అందజేస్తున్నారనీ, అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమంత్రికి రెండు కళ్లు లాంటివని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. బుధవారం మండల పరిధిలోని జి.ఎర్రగుడిలో కేంద్ర ప్రభుత్వం రూ.2వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేలును అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల ఖాతాలో జమ చేసేందుకు పత్తికొండ నియోజకవర్గంలో మొత్తం 54,774 మంది రైతులకు గాను రూ.37,177 కోట్లు నగదును రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తుగ్గలి నాగేంద్ర, బత్తిన వెంకట్రాముడు, ఆలంకొండ నబీ, మనోహర్ చౌదరి, వెంకటస్వామి, తిమ్మయ్య చౌదరి, వెంకటపతి, మిద్దె వెంకటేశ్ యాదవ్, బాదడ కౌశిక్ కుమార్, తిరుపాల్ నాయుడు, ఏడీఏ విజయమోహన్, ఏవోలు సురేష్ యాదవ్, మహేంద్ర, రవి తదితరులు పాల్గొన్నారు.

● బెంగుళూరు-మంత్రాలయం ప్రధాన రహదారిలో గుంతలు పడి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయించామని, పురాతన ఆలయమైన రామలింగేశ్వరస్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేయడం ఎంతో హర్షించదగ్గ విషయమని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. ఆలయధర్మకర్త గోపి, నాయకులు, గ్రామపెద్దలు బాలన్న, బత్తిన వెంకట్రాముడు, మనోహర్ చౌదరి, మిద్దె రవి, మిద్దె వెంకటేష్, సీఐ పులిశేఖర్, బలరాముడు, తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు రూరల్ రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి అన్నారు. బుధవారం ఆలూరు వ్యవసాయ కార్యాలయంలో అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ రెండో విడత కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైకుంఠం జ్యోతి హాజరై ప్రారంభించారు. అన్నదాతల కష్టాలను చూసి కూటమి ప్రభుత్వం సాగుకు ఆసరాగా అన్నదాత లబ్ధి చేకూరుతుందన్నారు. సుఖీభవ పథకం ద్వారా ప్రతిఏటా రూ.20 వేలు రైతుల ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. రైతులు బాగుంటే దేశం బాగుంటుందని, అందుకే 75 ఏళ్ల వయస్సులో ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి కోసం చంద్రబాబునాయుడు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. మార్కెట్‌యార్డు చైర్మన్ బిళ్లేకల్ వెంకటేశ్వర్లు, ఏడీఏ చెంగలరాయుడు, ఏఓ వెంకటేశ్వరగౌడ్, టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కటారుకొండ శ్రీనివాసులు, సింగిల్‌విండో చైర్మన్‌లు బేవిన ఈరన్న, గూళ్యం ప్రకాష్, కొండ రామాంజినేయులు, టీడీపీ సీనియర్ నాయకులు ఆలూరు రహమాన్, నరసప్ప, తిమ్మయ్య, ముద్ద రంగయ్య, గూళ్యం రామాంజినేయులు, కొండా పురుషోత్తం, కొమ్ము రాజు, కిట్టు, కమ్మ మధు, రాము యాదవ్, బొగ్గు రాముడు, అంజనేయ తదితరులు పాల్గొన్నారు.


ఆలూరులో మాట్లాడుతున్న వైకుంఠం జ్యోతి

ఆదోని రూరల్ : ప్రజాప్రభుత్వం కూటమికి ఇంకా పదిహేనేళ్ల పట్టం కట్టాలని, అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ రైతులకు ఎంతో అండ అని ఏపి సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు తెలిపారు. అన్నదాత సుఖీభవ రెండవ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం బుధవారం ఆదోని మండలం పెద్దతుంబళంలో వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ అజయ్ కుమార్, సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, టీడీపీ సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏడీఏ బాలవర్ధిరాజు, డిప్యూటీ తహశీల్దార్ బాబు, విఆర్ఓ. బసవరాజు, ఎఈఓలు సతీష్, అయ్యన్న, ఎస్.ఐ మల్లికార్జున, శ్రీకాంత్ రెడ్డి, రామాంజనేయులు, విట్టా రమేష్, లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.


ఆదోని రూరల్: చెక్కులను పంపిణీ చేస్తున్న ధర్మవరం సుబ్బారెడ్డి, సీనియర్‌నాయకుడు ఉమాపతి నాయుడు

బీపీఎస్ అవకాశాన్ని వినియోగించుకోవాలి

ఆదోని టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిధులలో అక్రమ కట్టడాలను క్రమబద్ధీకరించుకోవడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బీపీఎస్(బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం)ను అందరూ వినియోగించుకోవాలని, ఇలాంటి అవకాశం మరొకసారి వచ్చే అవకాశం లేదని మున్సిపాలిటీ పట్టణ ప్రణాళిక అధికారి బాల ముద్దయ్య అన్నారు. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్ హాల్లో ఇన్‌చార్జి కమిషనర్ నాసిర్ హుస్సేన్ ఆధ్వర్యంలో స్థానిక ఎల్‌టీపీలతోపాటు సచివాలయాలలోని వార్డు ప్లానర్‌లకు బీపీఎస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో టీపీవో మాట్లాడుతూ ప్లాను మంజూరు లేకుండా జరిగిన అక్రమ కట్టడాలు, ప్లాను మంజూరుకు అదనంగా నిర్మించిన అదనపు కట్టడాలను క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉందన్నారు. క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం 120 రోజుల సమయాన్ని ప్రకటించిందని ఆలోగా క్రమబద్ధీకరణకు నోచుకోని నిర్మాణాలను ప్రభుత్వ ఆదేశాల మేరకు కూల్చివేయడం జరుగుతుందన్నారు. టీపీవో బాలముద్దయ్య మాట్లాడుతూ, బీపీఎస్‌తోపాటు జనరల్ ప్లానులను కూడా కేవలం లైసెన్స్ పొందిన ఎల్‌టీపీలు మాత్రమే వేయాలని, ఎక్కడైనా వార్డు ప్లానర్‌ల జోక్యం ఉందని తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

30 శాతం ఐఆర్ ప్రకటించాలి


నూతనంగా ఎన్నికైన సంఘం నాయకులు

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మార్కండేయ స్వామి ఫంక్షన్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆదోని తాలుకా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తాలుకా అధ్యక్షుడిగా ఎం లక్ష్మీ నాగరవి, కార్యదర్శిగా శేషాద్రి, అసోసియేటెడ్ అధ్యక్షుడిగా చెన్నయ్య, ఉపాధ్యక్షులుగా వెంకటరమణ, సందీప్, వినోద్, రాజ్‌కుమార్, రాజశేఖర్, హిమబిందు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా తిరుమలేష్, కార్యదర్శిగా ఎల్లప్పతో పాటు మరికొంత మందిని ఎన్నుకున్నారు.

రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీలకు ఎంపిక

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మదిరె గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రంగన్న తెలిపారు. బుధవారం ఎంపికైన విద్యార్థులు అలేఖ్య, సోమలింగ, ఉషారాణిలను అభినందించారు. అండర్-14, అండర్-17 బేస్‌బాల్ పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. రంగనాయకులు, అరుణజ్యోతి, శ్రీనివాసులు, సుధాకర్ బాబు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్లతో అప్రమత్తంగా ఉండాలి

మద్దికెర, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి):మండలంలోని రైతులు సాగు చేసిన పంటలలో తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ అధికారి రవి అన్నారు. బుధవారం మండలంలోని బసినేపల్లి గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

ఆలూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలు చెల్లించాలని కోరుతూ బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. సీపీఎం నాయకులు నారాయణస్వామి మాట్లాడుతూ రెండు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నా రన్నారు. అలాగే యూనిఫాం, బట్టల కూలీ డబ్బులు, పనిముట్లు ఇవ్వాలని, శానిటరీ కాస్మొటిక్స్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎంపీడీఓకు వినతి పత్రం అందించారు కృష్ణ, గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం నాయులు నరసప్ప, జయరాము, గాదిలింగ, మాధవి, నరసమ్మ, పాల్గొన్నారు.

వైద్య విద్యతో వ్యాపారమా...?


సంతకాల సేకరణలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి

పత్తికొండ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నడపాల్సింది పోయి ప్రైవేటీకరణతో వైద్య విద్యను వ్యాపారం చేయడం ఏమిటని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బుధవారం పట్టణంలోని తేరుబజార్, ముస్లిం వీధుల్లో పార్టీ శ్రేణులతో కలిసి మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి పీపీపీ విధానాన్ని నిరసిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. . రాష్ట్రంలో ఉన్న మెడికల్ కాలేజీలకు రూ.5 వేల కోట్లు నిధులు వెచ్చిస్తే సంపూర్ణంగా మెడికల్ కాలేజీలు పూర్తవుతాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పీపీపీ విధానాన్ని విరమించుకుని ప్రభుత్వమే మెడికల్ కళాశాలల నిర్వహణ బాధ్యతను తీసుకోవాలన్నారు. ఎంపీపీ నారాయణదాస్, నాయకులు సోమశేఖర్, శ్రీరంగడు, హోటల్ రామచంద్ర, టీఎండీ హుసేన్ పాల్గొన్నారు.

సమస్యలు తీరాలంటే జిల్లా ఏర్పాటు తప్పనిసరి


మాట్లాడుతున్న గుడిసె ఆది కృష్ణమ్మ

ఆదోని, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆదోనిని ప్రత్యేక జిల్లాగా ప్రకటించడమే ఈ ప్రాంత సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారమని రాష్ట్ర టీడీపీ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ గుడిసె కృష్ణమ్మ అన్నారు. బుధవారం ఆదోని జిల్లా సాధన కోసం స్థానిక నాయకులు, కార్యకర్తలు చేపట్టిన రిలే నిరాహార దీక్షకు ఆమె సంఘీభావం ప్రకటించి మద్దతు తెలిపారు. కర్నూలు పశ్చిమ ప్రాంత ప్రజలు వైద్యం, ఆరోగ్యం, ఆగునీరు, సాగునీరు, విద్య, రవాణా, ప్రభుత్వ సేవలు వంటి అనేక కీలక విభాగాల్లో తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నారని కృష్ణమ్మ పేర్కొన్నారు. మురళి, కపటి మాధవ, మారుతి, కల్లుభాయి మల్లికార్జున పాల్గొన్నారు.

ఆదోని అగ్రికల్చర్ : పశ్చిమ ప్రాంత నియోజకవర్గాలు అభివృద్ధి చెందాలంటే ఆదోని జిల్లా సాధించుకుంటేనే సాధ్యమవుతుందని బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరి నాయుడు అన్నారు. బుధవారం ఆదోనిలో గత ఆరు రోజులుగా ఆదోని జిల్లా, పెద్దహరివాణంను మండలంగా ప్రకటించాలని చేస్తున్న దీక్షలకు మద్దతు తెలిపారు. సాయిబాబా, దేవిశెట్టి ప్రకాష్, కత్తి హనుమంతరావు, ప్రకాష్, వీరభద్ర, ఆదినారాయణ పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్


కేజీబీవీ పాఠశాలకు శానిటరీ ప్యాడ్స్ మిషన్‌ను అందిస్తున్న యాక్సెస్ టీం, ఎన్‌జీవో సభ్యులు

ఆలూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని జిల్లా గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి స్నేహలత అన్నారు. బుధవారం చిప్పగిరిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో హైదరాబాద్ యాక్సెస్ టీం, ఎన్‌జీవో సభ్యులు వీణ, అమ్రిన్, అరవింద ఆధ్వర్యంలో శానిటరీ ప్యాడ్స్ డిస్పోజెర్సీ మిషన్‌ను అందజేశారు. జీసీడీవో స్నేహలత మాట్లాడుతూ యాక్సెస్ ఎనర్జీ టీం జిల్లాలోని చిప్పగిరి కేజీబీవీ పాఠశాలను ఎంపిక చేసి మిషన్ అందజేయడం అభినందనీయమన్నారు. జిల్లా కలెక్టర్, డీఈఓ అనుమతులు తీసుకున్న అనంతరం మిషన్ సదరు సంస్థ మరియు ఎన్‌జీవో సభ్యులు ఇవ్వడం జరిగిందన్నారు. కర్నూలు జిల్లాలో వెనకబడిన చిప్పగిరి కేజీబీవీ బాలికలు అవసరమైన మిషన్‌ను బహూకరించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సావిత్రి, ఎన్జీవో సభ్యులు స్వప్న, తులసి, ప్రణీత పాల్గొన్నారు.

'గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి'

ఆదోని రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఉన్నఅన్ని గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి పెడతామని మండల కార్యాలయ ఏఓ నాగరాజు స్వామి పేర్కొన్నారు. బుధవారం ఎంపిపి భవనంలో ఆయా గ్రామాల సర్పంచులతో, పంచాయతీ కార్యదర్శులతో శిక్షణ తరగతుల సమావేశం నిర్వహించారు.

కాలువల నిర్మాణం చేపట్టాలి



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

దేవనకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి):మండలంలో హంద్రీనీవా ఆయకట్టుకు పంట కాలువలు పూర్తైంత వరకు పోరాటం చేస్తామని సీపీఎం జిల్లా నాయకులు వీరశేకర్, ఆనంద్‌బాబు అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా నిర్వహించిన బైక్ ర్యాలీని బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ముగింపు పలికారు. అనంతరం వివిధ గ్రామాల రైతులతో కలసి ధర్నా చేశారు.పెండింగ్లో ఉన్న హంద్రీనీవా కాలువలు పనులు పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాలకృష్ణ, రంగస్వామి, ఆశోక్, సర్పంచులు చిన్నరామప్ప, అరుణ్‌కుమార్, మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

తుగ్గలి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని మారెళ్ల సొసైటీ అధ్యక్షులు వైవీ ప్రభాకర్ రెడ్డి, సీఈవో మనోహర్ నాయుడు అన్నారు. బుధవారం కర్నూలులో 72వ సహకార వారోత్సవాల సందర్భంగా రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో మారెళ్ల సొసైటీ సిబ్బంది, రైతులు రక్తదానం చేశారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం అందరి బాధ్యత అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ రాంపల్లి శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపిక


విద్యార్థినిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు కబీర్ సాబ్

హొళగుంద, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు హొళగుంద జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి చలువాది భూమిక ఎంపికైనట్లు హెచ్‌ఎం కబీర్ సాబ్ తెలిపారు. కర్నూలులో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-17 కబడ్డీ జట్టు ఎంపిక పోటీల్లో బాలికల విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అవ్వడం పట్ల గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యయులు హర్షం వ్యక్తం చేశారు.

రైతు క్షేమమే కూటమి లక్ష్యం

దేవనకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతు క్షేమమే కూటమీ లక్ష్యమని టీడీపీ నాయకులు ఆకుల వీరేష్, జనసేన నాయకులు ఉచ్చీరప్ప అన్నారు. మండలంలో 15,220 మంది రైతులకు అన్నదాత సుఖీభవ రూ.10,64,40,000 ఖాతలలో నిధులు జమ కానున్నట్లు ఏవో ఉషారాణి తెలిపారు. స్థానిక రైతుసేవా కేంద్రంలో సీఎం చంద్రబాబునాయుడు రెండోవిడత అన్నదాత సుఖీభవ విడుదల కార్యక్రమాన్ని రైతులు, నాయకులు అధికారులు టీవీలో వీక్షించారు.

శుద్ధ జలాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఆస్పరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన ఆస్పరి పెద్దబావి దగ్గర ఏర్పాటు చేసిన శుద్ధ జలాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆస్పరి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మూలింటి రాధమ్మ అన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో 10 లీటర్ల శుద్ధ జలాన్ని రూ.2 కే అందిస్తున్నామన్నారు. కార్యదర్శి విజయ్‌రాజ్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ప్రణాళికతోనే గ్రామాభివృద్ధి

ఆలూరు రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేసుకుని సుస్థిర అభివృద్ధి లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయాలని ఆలూరు ఎంపీడీఓ మద్దిలేటిస్వామి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి అంశంపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో పంచాయతీలకు ఆదాయ వనరులను అందించేందుకు కృషి చేస్తామన్నారు. సంపద సృష్టి కేంద్రాల ద్వారా పంచాయతీలకు ఆదాయం వస్తుందన్నారు. వీధి లైట్లు, పారిశుధ్యం, తాగునీటి సమస్య లేకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ రమాదేవి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి

ఆదోని టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : దివంగత ప్రధానమంత్రి ఇందిరా గాంధీ 108వ జయంతి సందర్భంగా బుధవారం ఆమె విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ ఉపాధ్యక్షుడు దిలీప్ దోకా, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి రావు, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకుడు శ్రీనిత్, తాయన్న, రామన్న యాదవ్, హనుమంతు పాల్గొన్నారు.

పత్తి జిన్నర్లను ప్రోత్సహిస్తే.. లాభసాటి ధర

● ప్రముఖ కాటన్ మర్చంట్ బత్తిని కుబేరనాథ్

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు ఇచ్చే రాయితీలను పత్తి జిన్నింగ్ పరిశ్రమ యజమానులకు కల్పించి ప్రోత్సహిస్తే పత్తి రైతులకు లాభసాటి ధర కల్పిస్తామని ఆదోని కాటన్ మర్చంట్ అసోసియేషన్ సభ్యుడు ఎండీబీఎల్ పత్తి పరిశ్రమ యజమాని బత్తిని కుబేరనాథ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన ఆదోనిలో జరుగుతున్న పత్తి రైతుల సమ్మేళనానికి ప్రత్యేక ఆహ్వానితుడిగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ వ్యవసాయ మార్కెట్ యార్డులో కల్పించని ధర ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లోని పత్తికి కల్పిస్తున్నామన్నారు. గతంలో ఆదోని మార్కెట్ యార్డ్‌లో దేశంలోనే రికార్డు స్థాయి ధర రూ. 13600 పత్తికి కల్పించామని గుర్తు చేశారు. సీసీఐ 7 క్వింటాళ్ల కొనుగోళ్ల నిబంధనను తాము మరింత పెంచాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. ప్రభుత్వం వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, స్పిన్నింగ్, జిన్నింగ్ ఆయిల్ పరిశ్రమలకు రాయితీలు కల్పించాలని కోరారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు


పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

హాలహర్వి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధి నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలను నిర్మిస్తున్నట్లు ఎంపీడీఓ వరలక్ష్మి అన్నారు. బుధవారం ఆమె బాపురం గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఎన్నో ఏళ్లుగా కాలనీల్లోని మురుగునీరు నిల్వతో రోగాలు వ్యాపించే పరిస్థితి ఏర్పడడం వల్ల అత్యవసర పనుల్లో ఈ సీసీ రోడ్లు, డ్రైనేజీ, కల్వర్టుల పనులు నిర్వహిస్తున్నామన్నారు. క్లస్టర్ ఇన్‌చార్జి ప్రహ్లాద రెడ్డి, కార్యదర్శి చెన్నబసప్పగౌడ్ పాల్గొన్నారు

ఓటరు జాబితను సక్రమంగా నిర్వహించండి

దేవనకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆయా బూత్‌లెవల్ పరిధిలోని ఓటరు జాబితను సక్రమంగా నిర్వహించాలని తహసీల్దార్ సుదర్శనం తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలో 62 పోలింగ్ బూత్ అధికారులకు, వీఆర్ఏలకు శిక్షణ ఇచ్చారు. 2002లో ఎన్నికల ఓటరు లిస్టు ప్రకారం ఎస్ఐఆర్ మ్యాపింగ్ చేసి 2025 ఓటరు లిస్టుకు ఎంత డేటా మ్యాపింగ్ అయిందో చూడాలన్నారు. తప్పొప్పులను సరిచేయాలని, కొత్త ఓటర్లును చేర్పించేలా చూడాలన్నారు. సూపర్‌వైజర్లు అమీనబేగం, విజయబాస్కర్, రవి, హరిబాబు, మండల సర్వేయర్ నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి రూ. కోటి రుణం

● ఒక్కో రైతుకు రూ.10 లక్షలు

చిప్పగిరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బెల్డోన సహకార సొసైటీ బ్యాంకు రైతులకు రూ. కోటి రూపాయల రుణాలు మంజూరైనట్లు సీఈఓ. హరికృష్ణ బుధవారం తెలిపారు. స్థానిక సొసైటీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఒక్కో రైతుకు రూ.10 లక్షల వరకు, ఎకరాకు రూ.2 లక్షలు చొప్పున రుణాలు ఇస్తున్నామన్నారు. గతంలో రుణాలు తీసుకున్న రైతులు చెల్లించని వారి రికవరీ విషయంలో చట్టపరమైన చర్యలు తీసుకోవడం వల్ల సొసైటీకి కోటి రూపాయలు రుణం మంజూరు చేసినట్లు తెలిపారు.

బీసీ హాస్టల్ వార్డెన్‌కు సన్మానం

వెల్దుర్తి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రమైన వెల్దుర్తి గ్రంథాలయంలో 58వ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని లైబ్రేరియన్ తోటమ్మ ఆధ్వర్యంలో బుధవారం మహిళా సాధికారతలో భాగంగా బీసీ గర్ల్స్ హాస్టల్ వార్డెన్ గిరిజాదేవిని పూలమాల, శాలువాతో సన్మానించారు. అంతకుముందు మాజీ ప్రధాని ఇందిరగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త సాయిప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలి

వెల్దుర్తి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రమైన వెల్దుర్తి మండల ప్రజాపరిషత్ సమావేశ భవనంలో బుధవారం ఎంపీడీవో సుహాసినమ్మ అధ్యక్షతన పర్యావరణాన్ని పరిరక్షించడం-పచ్చదనాన్ని పెంపొందించడంపై పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఉపసర్పంచులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏవో లలిత, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

● ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి
● అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల చెక్కులు విడుదల


దైవందిన్నెలో చెక్కు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బీవీ


కౌతాళంలో చెక్కు విడుదల చేస్తున్న రాఘవేంద్ర రెడ్డి


పెద్దకడబూరులో మాట్లాడుతున్న రమాకాంత్ రెడ్డి

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని దైవందిన్నె గ్రామంలో నియోజకవర్గంలోని రైతులకు అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ కింద మంజూరైన 25.789కోట్ల చెక్కును బుధవారం విడుదల చేశారు. అనంతరం గ్రామంలోని ఇంటింటికి తిరిగి ప్రజాసమస్యలు అడిగి తెలుసుకుకున్నారు. గ్రామంలోని ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో ఎక్కడా కూడా తాగునీరు, సీసీ రోడ్ల సమస్యలు ఉండకూడదని అధికారులకు తెలియజేశారు. ఎక్కడెక్కడ తాగునీటి కుళాయిలు వేయాలని, సీసీ రోడ్లు, డ్రైనేజీలు వేయాలనే విషయాలను నేరుగా అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. గ్రామంలోని పాఠశాలను సందర్శించి ఏమైనా సమస్యలు ఉన్నాయా..లేదా అనే విషయాలను అక్కడి ఉపాధ్యాయులు, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో రూ.30 లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్లను, సచివాలయాన్ని, ప్రారంభించారు. ఆయన విలేకరు సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కేవలం మాటలు తప్ప ఒక్క అభివృద్ధి పనికూడా చేయలేదన్నారు. రోడ్ల నిర్మాణానికి ఒక్క పిడికెడు మట్టిని కూడా వెయ్యలేదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీ నిధులను కూడా దారిమళ్లించారన్నారు. దైవందిన్నె గ్రామంలో వైసీపీ హయాంలో కనీసం తాగేందుకు కూడా గుక్కెడు నీరు కూడా దొరకని పరిస్థితి ఉండేదన్నారు. తాము అధికారంలోకి వచ్చిన 17నెలల్లోనే గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామన్నారు. పాఠశాలలు అభివృద్ధి చేస్తామని చెప్పి పాఠశాలలకు కేవలం రంగులు వేసి చేతులు దులుపేసుకున్నారన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నానని చెప్పారు. టీడీపీ మండల కన్వీనర్ కేటీ వెంకటేశ్వర్లు, చంద్రన్న, జగదీష్, రాఘవేంద్ర, ఎంపీడీవో బంగారమ్మ, ఏడీఏ హమ్మద్‌ఖాద్రీ, ఏవో శివశంకర్, ఏఈవో నరసింహులు, పీఆర్ ఏఈ జయన్న, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

కౌతాళం: రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి అన్నారు. కౌతాళంలో బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం కింద రైతులకు పెట్టుబడి సాయం కింద రెండో విడత నగదు జమ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ, బీజేపీ, జనసేన మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జిలు రాఘవేంద్ర రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, లక్ష్మన్న ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి సాయం కింద సంవత్సరానికి రూ.20వేల నగదును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అందిస్తున్నాయని, ఇందులో బాగంగా రెండో విడతలో రైతుల బ్యాంకు ఖాతాలోకి రూ.7వేలు జమ చేశామని తెలిపారు. ఇందులో రాష్ట్ర వాటా అన్నదాత సుఖీభవ కింద రూ.5వేలు, కేంద్ర వాటా పీఎం కిసాన్ పథకం కింద రూ.2వేలు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం నియోజకవర్గ రైతులకు రూ.27.616కోట్లు మంజూరు కాగా కౌతాళం మండలానికి రూ.9.23కోట్లు మంజూరు అయినట్లు తెలిపారు. ఈ చెక్కును వ్యవసాయాధికారులతో కలిసి ప్రదానం చేశారు. అనంతరం మండల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండల ప్రత్యేకాధికారి రాజు, తహసీల్దార్ రజనీకాంత్ రెడ్డి, సీఐ అశోక్ కుమార్, కౌతాళం, పెద్దకడబూరు మండలాల టీడీపీ అధ్యక్షులు సురేష్ నాయుడు, మల్లికార్జున, కౌతాళం, బదినేహల్ సొసైటీ అధ్యక్షులు వెంకటపతిరాజు, మారెప్ప, కోసిగి మండల నాయకులు నర్సారెడ్డి, జ్ఞానేష్, కౌతాళం మండల నాయకులు అడివప్పగౌడ్, రాజానందు, వీరేష్, వ్యవసాయాధికారి శేషాద్రి కూటమి నాయకులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు: అభివృద్ధి, సంక్షేమం కూటమి ధ్యేయమని టీడీపి రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం పెద్దకడబూరులోని రైతు సేవా కేంద్రం-2లో అన్నదాత సుఖీభవ విడుదల సీఎం చంద్రబాబు లైవ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతుల పక్షాన కూటమి తరుపున, సీఎం చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సింగల్ విండో చైర్మన్ మీసేవ ఆంజినేయులు, నాయకులు మల్లికార్జున, రైతులు పాల్గొన్నారు.

అసత్యాలు ప్రచారం చేస్తున్న వైసీపీ: ఎమ్మెల్యే


వైసీపీ నాయకులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల ప్రజల సంక్షేమాన్ని, అభివృద్ధిని పట్టించుకోని వైసీపీ.. అదిచేశాం, ఇదిచేశాం అంటూ అసత్యాలు ప్రచారం చేస్తోందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే ఇంటిదగ్గర ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గోనెగండ్ల మండలం గంజహళ్లి గ్రామానికి చెందిన వైసీపీ ఎంపీటీసీ చిలక నాగరాజు, మాజీ ఎంపీటీసీ బందెనవాజ్, వైసీపీ గ్రామ అధ్యక్షుడు ప్రహ్లాద్‌తో పాటు 60 కుటుంబాలు వైసీపీని వీడి ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలో చేరాయి. అనంతరం ఆయన మాట్లాడుతూ గంజహళ్లి గ్రామాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. పార్టీలో చేరిన తాజా, మాజీ ఎంపీటీసీలు మాట్లాడుతూ వైసీపీలో ఒకే వర్గం ఆధిపత్యం కొనసాగుతోందని, అవసరం ఉన్నంత వరకే వాడుకొని వదిలేస్తున్నారని ఆరోపించారు. పార్టీలో చేరిన వారు అనంతరం టీడీపీ నాయకుడు బాస్కర్ల చంద్రశేఖర్‌ను కలిశారు. టీడీపీ మండల అధ్యక్షుడు తిరుపతయ్య నాయుడు, కృష్ణమనాయుడు, రంగారెడ్డి, తిమ్మారెడ్డి, నజీర్, మురళీ నాయుడు, పెద్ద లక్ష్మన్న, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, బేతాళ బడేసాబ్, ఎస్వీ రామాంజనేయులు, నరసింహులు పాల్గొన్నారు.

● పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో కోసిగి రోడ్డువైపు రూ. 2.75 కోట్లతో నిర్మించనున్న దుకాణ సముదాయానికి బుధవారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లయ్య, వైస్ చైర్మన్ అంజి, ప్రత్యేక శ్రేణి కార్యదర్శి చంద్రమౌళి, కమీషన్ ఏజెంట్ల సంఘం అధ్యక్షుడు ఉరుకుందయ్య శెట్టి, కృష్ణమూర్తి, వ్యాపారులు, సిబ్బంది పాల్గొన్నారు.

28 నుంచి అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్

● విజేత జట్టుకు రూ.2.22 లక్షలు, రన్నర్‌కు రూ.1.11 లక్షలు
● పోస్టరును ఆవిష్కరించిన ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా దివంగత నేత బీవీ మోహన్ రెడ్డి అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్‌ను ఈనెల 28 నుంచి నిర్వహించనున్నారు. వచ్చే ఏడాది జనవరి 5న ఫైనల్ మ్యాచ్ ఉంటుంది. ప్రతి ఏడాది మాదిరిగానే 2026లో జరిగే జాతర సందర్భంగా మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. టోర్నమెంట్ విన్నర్‌కు కప్పుతో పాటు రూ. 2,22,222, రన్నర్‌కు రూ. 1,11,111 బహుమతి అందజేయనున్నారు. పోస్టరును ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి బుధవారం విడుదల చేశారు.

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి: ఎస్టీయూ

పెద్దకడబూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహయింపు ఇవ్వాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పెద్దకడబూరులోని ఎంపీపీ మెయిన్ పాఠశాలలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేసి బోధనేతర పనులను తొలగించాలన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేసి పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలన్నారు. మధ్యంతర భృతి 30శాతం ప్రకటించాలన్నారు. అనంతరం ఎస్టీయూ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఎస్టీయూ నాయ కులు నాగరాజు, ఈరేష్ రాజు, రామకృష్ణ, అనిత, ఈరన్న, బీరప్ప పాల్గొన్నారు.

వీరశైవులు ఐక్యంగా ఉండాలి

● వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రుద్రగౌడ్


సంఘీభావం తెలుపుతున్న వీరశైవ సంఘం నాయకులు

ఎమ్మిగనూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): వీరశైవ ధర్మాన్ని పాటిస్తు వీరశైవులంత ఐక్యంగా ఉండాలని వీరశైవ లింగాయత్ కార్పోరేషన్ మాజీ చైర్మన్ వై రుద్రగౌడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని వీరశైవ కల్యాణమండపంలో వీరశైవకులస్తుల కార్తీక వనభోజన కార్యక్రమన్ని టీచర్ ఈరన్న అధ్యక్షతన నిర్వహించారు. బసవేశ్వరస్వామి చిత్రపటానికి, ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు రుద్రగౌడ్, పురుషోత్తం గౌడ్, నాగరాజు గౌడ్, జిల్లా నాయకులు మల్లికార్జున, చంద్రశేఖరప్ప మాట్లాడుతూ వీరశైవులు తమ సంప్రదాయాలను పిల్లలకు నేర్పాలన్నారు. వీరశైవకులం ఓబీసీలో చేర్పించాలని కేంద్రానికి ప్రజాప్రతినిధుల ద్వారా వినతులు పంపామన్నారు. అంతకు ముందు పీఠాధిపతులు పంపాపతి స్వామి, రుద్రముని స్వామి, నాగయ్య స్వామి, మఠం పరమేశప్ప స్వాములను నిర్వాహకులు సత్కరించారు. గోనెగండ్ల నాయకుడు ఈరన్న విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. పట్టణ నాయకులు రాచోటప్ప, మామిడి మల్లికార్జున, బసవేశ్వర వీరశైవ లింగాయత్ సంక్షేమ సంఘం నాయకులు నాగరాజు గౌడ్, మూర్తి, ఈశ్వరప్ప, పరమేష్, ఆలే ఈరన్న, గూళెప్ప, నాగన్న గౌడ్, అయ్యన్న, శ్రీనివాసులు, అజయ్, గాయత్రి, విజయ పాల్గొన్నారు.

మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దండి

మంత్రాలయం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ఎస్‌హెచ్‌జీ గ్రూపు మహిళలను బ్యాంకు రుణాల ద్వారా వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఏపీఎం, సీసీలపై ఉందని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ రమణారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం రాజశేఖర్ ఆధ్వర్యంలో బ్యాంకు రుణాల టార్గెట్, జీవనోపాదులు, శ్రీనిధి, గ్రూపుల నిర్వహణ, రుణాలు చెల్లింపు వంటి అంశాలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ సీసీ పరిధిలో ఉన్న గ్రామాల్లోని పొదుపు గ్రూపులు మహిళలకు రుణాల టార్గెట్‌ను పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు కళావతి, ఏపీడీ నర్సమ్మ, డీపీఎం నవీన్, ఐబీఏపీఎం ప్రభావతి, సీసీలు బసన్న, ఖాజా, చాముండేశ్వరి, రామలింగ, వీవోఏలు పద్మావతి, నాగమ్మ, నాగవేణి, ఈశ్వరప్ప, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు శిక్షణ తరగతులు

గోనెగండ్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గోనెగండ్లలోని ఎంపీడీవో సమావేశ భవనంలో బుధవారం మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్, ఉపసర్పంచ్ లు, పంచాయతీ కార్యదర్శులకు క్లీన్ అండ్ గ్రీన్ పై ఒక్కరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎంపీడీవో మణిమంజరి, ప్రత్యేక శిక్షణ పొందిన అధికారులు నూర్‌బాషా, శ్రీధర్ గ్రామాల సర్పంచ్‌లకు గ్రామంలో క్లీన్ అండ్ గ్రీన్ ఎలా చేసుకోవాలో వివరించారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి


గ్రంథాలయ ఉద్యమకారుల చిత్ర పటాల వద్ద నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ ఇన్‌చార్జి హరికృష్ణ, మాచాని సోమప్ప బాలికల కళాశాల ప్రిన్సిపాల్ విజయరాణి సూచించారు. పట్టణంలో గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించారు. గ్రంథాలయాల వారోత్సవాల్లో భాగంగా మహిళల సాధికారత, ప్రాముఖ్యత, చట్టాల గురించి విద్యార్థినులకు తెలియజేశారు. ఉపాధ్యాయులు ఉమా, సుజాత పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కౌతాళం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉరుకుంద ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం హరిప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల అండర్-14, 17 సాఫ్ట్, బేస్‌బాల్ పోటీలు నంద్యాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో తమ పాఠశాలకు చెందిన 10వ తరగతి చదువుతున్న కావలి సూరి, శిరీష అండర్ 17 విభాగంలో అండర్ 14 విభాగంలో సాఫ్ట్ బాల్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. అలాగే అండర్-17 విభాగంలో బేస్‌బాల్‌లో రామకృష్ణ, గీతలు, అండర్ -14 విభాగంలో వీరేంద్ర ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. పీడీ వరలక్ష్మి, పీఈటీ రమేశ్‌ను, ఎంపికైన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

మందులను కాల్చేశారు..!

గోనెగండ్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నెరుడుప్పల గ్రామం శివార్లలో బుధవారం మధ్యాహ్నం ప్రభుత్వం హెల్త్ సెంటర్లకు విడుదల చేసిన మందులు ముళ్లపొదలలో పడివున్నాయి. అలాగే కొంత దూరంలో మరిన్ని మందులను కాల్చి వేశారు. ఈ విషయంను గుర్తించిన గ్రామస్థులు ఆరోగ్యసిబ్బందే ఈ పనిచేసి ఉంటారని ఆరోపిస్తున్నారు. సబ్ సెంటర్‌ల ఆరోగ్య సిబ్బంది ప్రభుత్వం ఉచితంగా అందజేసే మందులను ఆయా గ్రామాల రోగులకు అందజేయాలని ముళ్ల పొందల పాలు చేయవద్దని కోరుతున్నారు. గోనెగండ్ల ప్రభుత్వ వైద్యురాలు రంగారవళిని వివరణ కోరగా విచారించి చర్యలు తీసుకుంటామనని చెప్పారు.


మందులను కాల్చివేసిన దృశ్యం

వైభవంగా పద్మనాభ తీర్థుల ఆరాధన


పద్మనాభ తీర్థుల బృందావనానికి పూజలు చేస్తున్న పీఠాధిపతులు

మంత్రాలయం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి పరమగురువులైన పూర్వపు పీఠాధిపతులు పద్మనాభ తీర్థుల మధ్యారాధన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కర్ణాటకలోని అనుగొంది నవ బృందావనంలో వెలసిన పద్మనాభ తీర్థుల బృందావనానికి మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు, శ్రీపాదరాజ మఠం పీఠాధిపతి సుజయనిధి తీర్థులు, బాలాగరూ మఠం పీఠాధిపతి అక్షోభ్యరామప్రియ తీర్థులు ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల మధ్య ప్రత్యేకక పూజలు నిర్వహించారు. స్వామివారికి హస్తోదకం చేసి త్రిమఠాల పీఠాధిపతులు మహా మంగళహారతి ఇచ్చారు. అక్కడే వారి సంప్రదాయ రీతిలో వేర్వేరుగా సంస్థాన పూజలు చేశారు. మంత్రాలయం పీఠాధిపతి ఇరువురి పీఠాధిపతులను ఘనంగా సత్కరించారు. సుజయీంద్రాచార్, ఆనందతీర్థఆచార్, గౌతమ్‌ఆచార్, విఠల్‌జోషి, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాష్‌ఆచార్, పవన్ ఆచార్, గోపాలకృష్ణస్వామి, వరదేంద్రాచార్, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

● మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథంపై విహరించారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

మంత్రిని కలిసిన నాయకులు


మంత్రి ఫరూక్‌ను కలిసిన టీడీపీ నాయకులు

కోసిగి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను బుధవారం నంద్యాలలోని మంత్రి కార్యాలయంలో టీడీపీ కోసిగి మండల అధ్యక్షుడు పల్లెపాడు రామిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి సూచనల మేరకు మండలంలోని ప్రజా సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. మాజీ జడ్పీటీసీ తోవి రామకృష్ణ, మార్కెట్ యార్డు నాగరాజు తదితరులు ఉన్నారు.

'కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటాం'

మంత్రాలయం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటామని మంత్రాలయం సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు, వైసీపీ జిల్లా ఉపాధక్షుడు ప్రదీప్ రెడ్డి అన్నారు. జిల్లా కార్యదర్శి సీవీ విశ్వనాథరెడ్డి అన్నారు. మాలపల్లి గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త నాగన్న (80) బుధవారం మృతి చెందడంతో ఆయన మృతదేహానికి నివాళి అర్పించారు. కుటుంబాన్ని ఓదార్చి ధైర్యంగా ఉండాలని సూచించారు. మట్టి ఖర్చులకు రూ.10 వేలు నగదును అందచేశారు. సర్పంచ్ కురువ లింగారెడ్డి నివాళి అర్పించి రూ. 5వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వీరనాగుడు, చిన్ననాగిరెడ్డి, ఏసేపు, తదితరులు పాల్గొన్నారు.

'మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ సరికాదు'


కోటి సంతకాల పత్రాలను ఆవిష్కరిస్తున్న వైసీపీ నాయకులు

మంత్రాలయం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం సరికాదని, వాటిని కాపాడుకుంటామని వైసీపీ రాష్ట్ర నాయకుడు మల్లికార్జున రెడ్డి అన్నారు. మండలంలోని బూదూరు గ్రామంలో బుధవారం మెడికల్ కళాశాలల ప్రైవేట్ చేసే విధానాన్ని నిరసిస్తూ కోటి సంతకాల సేకరణను వైసీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి, లక్ష్మిరెడ్డి, గొల్ల వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ పేదలకు వైద్యవిద్య, వైద్యం దూరం చేయడానికే చంద్రబాబు పీపీపీ విధానాన్ని తీసుకొచ్చారని ఆరోపించారు. ప్రతి ఒక్కరూ కోటి సంతకాల సేకరణలో పాల్గొని నిరసన తెలపాలని కోరారు. సమావేశంలో వైసీపీ నాయకులు పాండు, రామలింగారెడ్డి, అదృష్టం, సజీవులు, ఆదాము పాల్గొన్నారు.

కోసిగిని కమ్మేసిన పొగ మంచు

కోసిగిలో చలి తీవ్రత పెరగడంతో ప్రజలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 8 గంటలైనా పొగమంచు అలాగే ఉండడంతో రైతులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 8 గంటలైనా పొగ మంచు కమ్ముకోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోసిగి తిమ్మప్పకొండపై నుంచి కోసిగిని పొగ మంచు కమ్మేయడంతో చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఈ ప్రకృతి దృశ్యాలను తిలకించి ప్రజలు తమ ఫోన్లలో బంధించుకుంటూ ఆనంద పరవశుతులయ్యారు.
- కోసిగి



గాజులదిన్నె ప్రాజెక్టుపై దృష్టి

● పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు సర్వే చేసిన అధికారులు

గోనెగండ్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పర్యాటక రంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా గాజులదిన్నె ప్రాజెక్టును పర్యటక రంగంగా అభివృద్ధి చేసేందుకు గాను బుధవారం ఏపీ టూరిజం శాఖ ఏఈ రాజేష్‌కుమార్, సర్వేయర్లు సాజిత్, సుధారాణి ప్రాజెక్టు ప్రాంతంలో ఉండే భూమిని సర్వే చేశారు. గత ఏడాది 100 రోజుల ప్లానింగ్ కింద రూ. 3 కోట్లు నిధులను విడుదల చేయాలని అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. నిధులు విడుదల అయితే పర్యాటకుల కోసం ఒక రెస్టారెంట్, ప్రాజెక్టులోని నీటిలో విహరించేందుకు బోట్‌లు, టాయిలెట్‌లు, పిల్లలు ఆడుకునేందుకు కావాల్సిన సామగ్రి, దివ్యాంగులకు, పర్యటకులకు ప్రత్యేక బాత్‌రూములు ఏర్పాటు కు సర్వేలు చేసినట్లు వారు తెలిపారు. ఈ పనులు పూర్తి అయితే దీంతో గాజులదిన్నె ప్రాజెక్టు పర్యటక రంగం మరింత అభివృద్ధి చెందనుంది. కర్నూలు జిల్లా లో గాజులదిన్నె ప్రాజెక్టు పర్యటక ప్రాంతంగా కొనసాగుంది. ఇక్కడి చెట్లు, ఆనకట్ట, నీటి అలలు చల్లగాలి పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తుంది. ప్రతి రోజు ఇక్కడికి చూట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు వస్తు సేద తీరుతూ సాయంత్రం వరకు అక్కడే కుటుంబసభ్యులతో గడిపి వెళ్తుంటారు. ఇక పర్వదినాలలో ప్రాజెక్టు పర్యాటకులతో కిటకిటలాడుతుంది. కర్నూలు, బెళగల్, గుడూరు, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని ప్రాంతాల నుంచి పర్యటకు వచ్చి సాయంత్రం వరకు గడిపి వెళ్తుంటారు. ప్రాజెక్టు పరిసరాలలో కొబ్బరి, నీలగిరి, టేకు చెట్లతో తోటలు కనువిందు చేసేవి. పర్యాటకుల సౌకర్యం కోసం అతిథి గృహం కూడా ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పర్యాటక రంగం కోసం సర్వేలు జరపడం పర్యాటక ప్రియులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సర్వేకు వచ్చిన అధికారులు మాట్లాడుతూ సర్వే చేసి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. ప్రస్తుతం అతిథి గృహానికి మాత్రం మరమ్మతులు చేశారు.


సర్వే చేస్తున్న పర్యాటకశాఖ అధికారులు

'ఆ ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి'

కోసిగి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కోసిగిలోని ఆది ఆంధ్ర ప్రాథమిక పాఠశాలలో విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు మల్లికార్జున, కృష్ణమూర్తి కోరారు. బుధవారం ఎంఈవో బాలయ్యకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ సోమవారం మధ్యాహ్నం 12 గంటలకే కొందరు ఉపాధ్యాయులు సొంత పనుల నిమిత్తం బయటకు వెళ్లిపోయారని, స్కూల్ ముగిసే సమయానికి ఉపాధ్యాయులు వచ్చారని ఆరోపించారు.